Sunnithamaina Kavi
Sumanasri
Sowbhagya

సుమనశ్రీ లలితమయిన కవి. శాంతివాది.
సౌందర్య ప్రేమికుడు. సంఘర్షణని
యిష్టపడడు. తనచుట్టూ వున్న ప్రకృతి
విలాసంతో పరవశించే కవి. సాధనలతో
సౌందర్యాన్ని, లాలిత్యాన్ని సమ్మేళనం చేసి
సంగీతభరితమయిన వాక్య నిర్మాణాన్ని
అలవరచుకున్నాడు. ఆయన ఏ దృశ్యాన్ని
వర్ణించినా, ఏ వస్తువును ఆవిష్కరించినా
ఒక మాధుర్యం నిండిన కవితాత్మకత
ఆయన శైలిలో కనిపిస్తుంది.



సున్నితమైన కవి

సుమనశ్రీ



సౌభాగ్య

సున్నితమైన కవి

సుమనశ్రీ

సౌభాగ్య

పబ్లిషర్స్ :

రమణ సుమనశ్రీ ఫౌండేషన్,

హైదరాబాద్.

Sunnitamaina Kavi Sumanasri
(Soft and sweet poet Sumanasri)

Poetry Criticism and Appreciation
by
Sowbhagya
Cell : 9848157909

First Published
November 2011

Published by :
Ramana Sumanasri Foundation

Copies available at :


1. Mrs. Chellapilla Vankata Ramana,
   Plot No. 121, Flat No. 3,
   Balaji Nivas Apartments,
   Kalyan Nagar (Phase I),
   S.R. Nagar (P.O.) Hyderabad-500 038
   Phone No. : 040-23811623
   Email: chellapilla 95@gmail.com

2. Palapitta Books
   H.No. 16-11-20/6/1/1, 403 Vijayasai Residency
   Saleem Nagar, Malakpet, Hyderabad-500 036.
   Phone : 040-27678430, Cell : 9848787284
   Email: palapittabooks@gmail.com

3. Navodaya Book House,
   Opp. Arya Samaj Mandir
   Kachiguda, Hyderabad.

4. Visalandhra Book House,
   Hyderabad.

Printed at :
Anupama Printers
Green View ,126, Shantinagar,
Hyderabad-28,   Ph: 23391364
Email: anupamaprinters@yahoo.co.in



అంకితం

ప్రఖ్యాత విమర్శకులు, సుమనశ్రీ గారి నాన్నగారి సహోధ్యాయులు,
అమితమైన అభిమానంతో సుమనశ్రీ 'నేత్రం సంకేతం' కావ్యాన్ని
ఆంగ్లంలోకి 'Eye My Symbol' గా అనువదించిన
కీ॥ శే॥ వడలి మందేశ్వరరావు గారి దివ్యస్మృతికి...

నా సాహిత్య కుటుంబానికి

ఇవే నా కృతజ్ఞతలు !

నాకొకింత సాహిత్యం మీద ఆసక్తి కలగడానికి మా అమ్మగారు లక్ష్మీ నరసమాంబ, మా నాన్నగారు కీ॥శే॥ బంగారేశ్వర శర్మగార్ల ప్రభావం చాలా ఉంది. మా అమ్మగారు పెద్దగా చదువుకొనకపోయినా ఆమెకి పుస్తక పఠనాభిలాష మెండుగానే ఉండేది. ఏ అచ్చుయిన కాగితం కనపడినా చదవకుండా వదిలేది కాదు ఆమె.

మా నాన్నగారు నరసరావుపేట మునిసిపల్ హైస్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేసిన సుశిక్షిత ఉపాధ్యాయులు. గణిత శాస్త్రంలోనూ, ఆంగ్లబోధనలోనూ దిట్ట. పిఠాపురంలోనూ కాకినాడలోనూ డిగ్రీ దాకా చదివిన ఆయన ప్రఖ్యాత కవులు శ్రీ సోమసుందర్, కీ॥శే॥ ఇస్మాయిల్‌గార్లకు సీనియర్. ఆ రోజుల్లో అష్టావధానం చేసిన పద్యకవి మా నాన్నగారు.

నాన్నగారి రచనలు ప్రబంధశ్రీ, రెడ్డిరాజు సంస్థాపనం ప్రభుత్వ పాఠశాలల్లో ఉపవాచకాలుగా బోధింపబడుతూ ఉండేవి. ఆయన కావ్యాలు 'సుమనశ్రీ' మరియు బ్రహ్మపురాణం (అసంపూర్ణం). ఆ 'సుమనశ్రీ' శీర్షికే నా కలంపేరుగా పెట్టుకున్నాను. అప్పట్నించీ ఆ పేరుతోనే వ్యాసాలు, కథలు కవితలు వ్రాయడం మొదలుపెట్టాను.

నాకు ఓనమాలు దిద్ది తెలుగులో అక్షరాభ్యాసం చేసిన శ్రీ ఏలియా మేష్టారు. ప్రఖ్యాత పద్యకవులు బీర్నీడి ప్రసన్న, సంతోషం మాష్టారు నాన్నగారి మిత్రకోటిలోని వారే. నాన్నగారికి కవిత్వం నిరలంకారంగా ఉండాలనే అభిప్రాయం బలంగా ఉండేది. మనుచరిత్రలోని సంక్లిష్టతను విమర్శిస్తూ ఉండేవారు. తను వ్రాసిన కవితలలో సాధ్యమైనంత వరకు సరళత్వాన్నే పాటించారు.

1962 ప్రాంతాల్లో నేను ఎస్.ఎస్.ఎన్. కాలేజీలో బి.ఎస్.సి. డిగ్రీ చేస్తున్న రోజులు. మా బాబయ్య కీ॥శే॥ ద్విభాష్యం వెంకట్రాయశాస్త్రి గారి చింతలూరి ఆయుర్వేద నిలయం షాపులో ప్రఖ్యాత కథకులు మంజుశ్రీ, తెలుగు అధ్యాపకులు శ్రీ మానూరి హనుమంతరావు గారిలాంటి సాహితీమూర్తులు కలుస్తూ ఉండేవారు. అక్కడే చాలా సార్లు వారితో స్వల్ప పరిచయం. వీళ్ళంతా నరసరావుపేటలో నా సాహిత్య ప్రస్థానంలో చేదోడు వాదోడుగా ఉండి ప్రోత్సహించినవారే.

పద్య కవిత్వంమీద అప్పట్లో చాలా వ్యాసాలే వ్రాసాను. కాలేజీ మేగజైన్లోనూ ఆంధ్రప్రభ వారపత్రికలోనూ అచ్చయ్యాయి. స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో ఒక వ్రాత పత్రికను కూడా నడిపేవాణ్ణి మిత్రులతో కలిసి. చిత్రంగా 'కాఫీ' మీద ఒక శతకం లాంటిది వ్రాసింది కూడా ఆ రోజుల్లోనే. 1965 నాటికి నర్సరావుపేటలో బి.ఎస్.సి. ముగించుకుని అనంతపురంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు సంవత్సరాల మెకానికల్ కోర్సులో చేరి హాస్టల్స్‌లో ఉంటున్నప్పుడు వ్యాసాలు, కథలూ అప్పుడప్పుడు వ్రాస్తూ ఉండేవాణ్ణి కానీ చదువుమీదే ధ్యాస. 1968 కల్లా డిగ్రీ పూర్తిచేసుకుని విశాఖలో మెషీన్ డిజైన్ పి.జి. కోర్సులో చేరిన తర్వాతే నా సాహిత్య వ్యవసాయం మరింత పెరిగింది. విశాఖ రచయితల సంఘంలో సభ్యుడిగా చేరడంతో డా॥ చందు సుబ్బారావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, రామకోటి, కీ॥శే॥ ఎన్నెస్ ప్రకాశరావుగార్లతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. 'పిచ్చిది నవ్వింది', 'జరాసంధుని చరమగీతం', 'నేనూ అవకాశవాదినే', 'రాబందుల రెక్కల చప్పుడు' లాంటి కథలు ఆ రోజులల్లోనే వెలుగుచూశాయి. జరాసంధుని చరమగీతం కథ విశాలాంధ్ర వారి విద్యార్థి సంకలనంలోనూ, నేనూ అవకాశవాదినే కథ ఎమ్మెస్కో వారి విద్యార్థి కథాంజలి–2లోనూ ప్రచురితమయ్యాయి. పిచ్చిది నవ్వింది, రాబంధుల రెక్కల చప్పుడు కాలేజీ మాగజైన్‌లో ప్రచురింపబడ్డాయి.

ఆంధ్రా యూనివర్సిటీ నుంచి 1976లో డాక్టరేట్ డిగ్రీ లభించాక 1977 నవంబరులో బి.హెచ్.ఇ.ఎల్. ఆర్. & డి, హైదరాబాద్‌లో చేరినప్పట్నించీ జీవితం మరో మలుపు తిరిగింది. హైదరాబాద్‌లో ఎందరో కవిమిత్రులు కీ॥శే॥ శేషేంద్ర, శివారెడ్డి, సిద్ధారెడ్డి, దేవిప్రియ, నగ్నముని, శీలావీర్రాజు, నిఖిలేశ్వర్, కీ॥శే॥ జ్వాలా ముఖిలకు సన్నిహితంకాగలిగాను. ఉస్మానియా యూనివర్సిటీలోని అమెరికన్ సొసైటీ రీసెర్చ్‌సెంటర్‌లో సభ్యత్వం పుచ్చుకున్నాక ప్రపంచ కవిత్వం చదవగలిగే అవకాశం లభించింది. పుస్తకాల షాపుల్లో కనబడ్డ ప్రతి పుస్తకం నే కొనేవాణ్ణి ఎంతో ఆసక్తిగా చదివేవాణ్ణి. 1986 నుంచి 1988 దాకా కెనడాలోని అట్టావా యూనివర్సిటీలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసే అవకాశం దొరకడం కూడా నాకు అనుకోకుండా లభించిన అదృష్టమే. అక్కడి జీవితం, యూనివర్సిటీ లైబ్రరీలో దొరికే గొప్పగొప్ప పుస్తకాలు, మాగజైన్లు, నా సాహిత్య ప్రపంచాన్ని విస్తృత పరిచాయి. 'నెలనెలా వెన్నెల' కృష్ణారావు గారితో పరిచయంతో ఎందరో ప్రఖ్యాత కవులు, రచయితలు యువకవుల పరిచయం అయ్యారు. కొంతమంది కవులతో అతి సన్నిహితమైన

పరిచయం ఏర్పడింది. నాకు చాలా బాగా నచ్చిన కవులు కొద్దిమందే. కవిత్వం గురించిన నా అభిప్రాయాలను నా కవితా సంకలనాలు రక్తనేత్రోదయం, రెప్పల మధ్య ఆకాశం, గీతం పునీతమౌతోంది, నేత్రం నా సంకేతం మరియు మహా స్వప్నంలలోనూ, నా విమర్శ గ్రంథాలు – కవిత్వం ఒక ఆత్మఘోష, అజంతాలిపి, విమర్శ ఒక అన్వేషణలలో విపులంగానే చర్చించాను. నా ఆత్మీయ కవుల కవిత్వం గురించి నా అభిప్రాయాలను నిస్సంకోచంగానే వెలువ రించాను.

ఆ పుస్తకాలలో ముచ్చటించని కవులు శ్రీ సైదాచారి, ఎమ్మెస్ నాయుడు, హెచ్చార్కే, ఆశారాజు, దేవిప్రియ, దెంచనాల శ్రీనివాస్ పసునూరి శ్రీధరబాబుల కవిత్వం కూడా నాకిష్టం. కీ॥శే॥ గుడిహాళం రఘునాథం నాకత్యంత ప్రీతిపాత్రుడైన కవి. నేను ప్రస్తావించిన కవులే కాక ఎంతోమంది కవులంటే నాకత్యంత గౌరవం. ప్రఖ్యాత కథకులు శ్రీ మునిపల్లె రాజుగారన్నా, నెలనెలా వెన్నెల నిర్వాహకులు శ్రీ సి.వి. కృష్ణారావుగారన్నా, ప్రఖ్యాత విమర్శకులు కీ॥శే॥ వడలి మందేశ్వరరావుగారన్నా, ప్రియమిత్రులు కీ॥శే॥ చంద్రశేఖర్ గారన్నా నాకు ఎంతో అభిమానం, గౌరవం. పొరపాటున మరి ఎవరినైనా ఇక్కడ స్మరించటం మరిస్తే క్షమించమని వారిని ప్రార్థిస్తున్నాను.

సౌభాగ్య నాకత్యంత ఆప్తుడైన కవి, సమీక్షకుడు. ఏ సాహిత్య సభకైనా వీలైనంత వరకు కలిసే వెళ్ళేవాళ్ళం. అభిప్రాయాల్ని కలబోసుకునేవాళ్ళం. నా కవిత్వంమీద పుస్తకం వ్రాసి మీ ముందుకు తెస్తున్నాడు. సౌభాగ్యకి ఏమిచ్చి ఈ రుణం తీర్చుకోగలను – కాసిన్ని కృతజ్ఞతలు తప్ప.

నాకత్యంత సన్నిహిత మిత్రులు, ప్రఖ్యాత కవులు, విమర్శకులు, ఆప్తులు శ్రీ వాడ్రేవు చిన వీరభద్రుడు గారు ఈ పుస్తకానికి ముందు మాట వ్రాయడం నాకెంతగానో ఆనందాన్నిచ్చింది, వారికి నా వినమ్ర కృతజ్ఞతలు.

ఇన్నేళ్ళూ నన్ను అత్యంత ప్రేమతోనూ ఆప్యాయతతోనూ చూసుకుంటున్న నా శ్రీమతి రమణాజీకి, నా కుమారులు డా॥ హేమచంద్రకుమార్, శ్రీ వెంకట సురేష్ బాబు, నా కోడళ్ళు సౌజన్య, ప్రియాంకలకూ, నా మనవళ్ళు నీల్‌కుమార్, శౌర్యన్‌లకు వారు పంచిన, పంచుతున్న ప్రేమకు ఆప్యాయతకు నేను ఎంతగానో రుణపడి ఉన్నాను. ఈ సందర్భంగా వారందరికీ నా కృతజ్ఞతలు, శుభాకాంక్షలు, ఆశీస్సులు.

మీ

సుమనశ్రీ

సుమనశ్రీతో నా స్నేహం

దాదాపు ముప్పయేళ్ళ క్రితం హైదరాబాదుకు వచ్చినప్పుడు నాకు సన్నిహితుడనయి కవి సుమనశ్రీ. నన్ను ప్రేమగా దగ్గరికి తీసుకున్నవాడు. శేషేంద్ర శర్మ, శివారెడ్డి వంటి కవుల యిళ్ళకు నన్ను తీసుకెళ్ళి పరిచయం చేశాడు. నాకు యింగ్లీషు ఒక ముక్కరాని రోజుల్లో ప్రపంచ సాహిత్యం గురించి నాకు వివరించాడు.

ఆయన రెప్పల మధ్య ఆకాశం కవితా సంపుటి చదివి ఆయనకు ఉత్తరం రాశాను. అప్పటినించీ తరచూ కలుసుకునే వాళ్ళం. ఆయన కవిత్వంలో గొప్ప ఆహ్లాదం, సౌకుమార్యం వున్నాయి. ఆయన భాషలో గొప్ప సంస్కారం, సౌందర్యం కనిపిస్తాయి. ఎంత సున్నితమయినవాడో అంత బలమైన వాడాయన. రాజకీయాలు కవిత్వంలోకి చొరబడడం ఆయనకు గిట్టదు.

నేను పత్రికలలో పనిచేసేవాళ్ళతో, సమీక్షలతో తీవ్ర ఆవేశానికి లోనయినప్పుడు నాకు ఆయన ఒక్కడే ఓదార్పు నిచ్చాడు ఆ రోజుల్లో. కృష్ణారావు గారి నెలనెలా వెన్నెల కంటె ముందునించీ మేము సన్నిహితులం. కలిసి ఆ సమావేశాలకు వెళ్ళేవాళ్ళం.

దాదాపు దశాబ్దాలపాటు రెండు మూడు రోజులకొకసారి కలుసుకునేవాళ్ళం. ఆయన ఆఫీసరయినా కవులన్నా, కవిత్వమన్నా అల్లాడేవాడు.దాదాపు యిరవయ్యేళ్ళు ఇద్దరం కలిసి తిరిగేవాళ్ళం. నేనొక్కడినే కలిస్తే సుమనశ్రీ ఏడీ? అని అందరూ అడిగేవాళ్ళు.

కవిత్వమన్నది సున్నితమైంది. దానికి గుంపుతో పనిలేదు. వ్యక్తిగతమయిన రాగ ద్వేషాలతో సంబంధంలేని సౌందర్య విషయమది. ఆయన ఏ సాహిత్య 'గ్రూపు'లకూ చెందడు. నన్ను 'మాక్స్‌ముల్లర్' భవనానికి తీసుకెళ్ళి అక్కడ మెంబర్ని చేసి జర్మన్ మహాకవి గెథెపై పుస్తకం రాసుకోవడానికి అన్ని అనుకూలాలు కలిగించాడు. ఆ గ్రంథ ప్రచురణకు వాళ్ళ దగ్గర ఆర్థికసాయం అందేలా చేశాడు. యీ రకంగా వ్యక్తిగతంగా ఆయన నాకు ఎన్నో రకాలుగా సాయం చేశాడు.

గత పది సంవత్సరాలుగా ఈ సాహిత్యవాతావరణానికి ఆయన దాదాపు దూరంగా మౌనంగా వున్నాడనే చెప్పాలి. దశాబ్దాల ఆయన సాహిత్య కృషి మహా సున్నితమయిన ఆయన కవితా సంపుటులు చూస్తే తెలుస్తుంది. నాలాగా యిష్టాయిష్టాల్ని బలంగా బయటపెట్టేరకం కాదాయన. సున్నితంగా మందలించేవాడు. కారణాలు ఏవయినా కవిత్వ వాతావరణంలో ఆయన కనిపించడం అరుదయి పోయింది.

ఆయన నాకు ఆత్మీయుడు. పత్రికలవాళ్ళు, కవులు, రచయితలు సభల్లో సమావేశాల్లో 'సుమనశ్రీ ఏమయ్యాడయ్యా? కనిపించడే' అని యిప్పటికీ అడుగుతూ వుంటారు.

అందరికీ చూపించడానికే సుమనశ్రీగారి కవిత్వంపై ఈ పుస్తకం రాశాను.

-సౌభాగ్య

ఒకడు నడిచిన దారి

సుమనశ్రీగా ప్రసిద్ధుడైన డా. చెళ్ళపిళ్ళ కామేశ్వరరావు కవిత్వం పైన, కవితా ప్రయాణంపైనా ఇన్నాళ్ళకు ఒక సమగ్ర పరిశీలన వస్తున్నందుకు నాకు సంతోషంగా ఉంది. ఈ పుస్తకానికి నన్ను ముందుమాట రాయమని అడిగినప్పుడు నన్ను చాలా ఆలోచనలు చుట్టుముట్టాయి. ఒకరకంగా చెప్పాలంటే నా కవిత్వంపైన ఎవరైనా ఇట్లాంటి పరిశీలన చేసి దానికి నన్ను ముందుమాట రాయమంటే నేనెటువంటి విచికిత్సకు లోనవుతానో దాదాపు అట్లాంటిదే ఈ పుస్తకం విషయంలో కూడా నేను ఎదుర్కొన్నాను. ఇది సుమనశ్రీ కవిత్వానికీ, కవిత్వ విషయానికీ, కవిత్వశైలికీ మాత్రమే సంబంధించిన విషయం కాదు. దాదాపుగా 70ల్లో, 80ల్లో రాయడం మొదలుపెట్టిన కవులందరికీ సంబంధించిన విషయం. కాబట్టి ఆ ఆలోచనల్నే కొన్నిటిని ఇక్కడ పంచుకునే ప్రయత్నం చేస్తాను.

2

సాధారణంగా ఎవరైనా యువకుడు కవిత్వం రాయడం మొదలు పెడుతున్నప్పుడు ఏదో ఒక విషయం గురించి తోచిన భావాలేవో సూటిగా, అమాయకంగా ఒక కవితగా రాసి మనకి చూపించినప్పుడు మనకి ఏం చెప్పాలో తెలియదు. ఎందుకంటే, అక్కడ ఆ యువకుడికి ఏది స్ఫురించిందో, దేన్ని హృదయ పూర్వకంగా భావిస్తున్నాడో దాన్నే కాగితం మీద పెట్టి మనకి చూపిస్తున్నాడు. అందులో అభివ్యక్తి తాలూకు నిజాయితీ ఉంటుంది కాబట్టి మనం ఆ భావాలతో ఏకీభవించకుండా ఉండలేం. ఆతడట్లా తన భావాల్ని పంచుకుంటున్నందుకు అతణ్ణి అభినందించకుండా కూడా ఉండలేం. కాని దాన్ని మనం సరాసరి కవిత అనలేం. భావాలు కవితగా మారాలంటే మరింకేదో జరగాలని మనకి తెలుస్తుంటుంది. ఏంచేస్తే ఆ యువకుడు తన భావాల్ని కవితగా చూపించగలుగుతాడు? దీనికి ప్రాచీన అలంకారికులు మూడు మార్గాలు చెప్పారు. ఒకటి, ఆ యువకుడికి కలిగిన అనుభూతిలో లేదా భావనలోనే మౌలికంగా మనల్ని ముగ్ధుల్ని చేసే ఒక వెలుగు ఏదో ఉండాలి. ఆ వెలుగు కూడా కొత్తదనానికి సంబంధించినదై ఉండాలి. దాన్ని వారు ప్రతిభ అన్నారు. ఒక రెండవది, ఆ యువకుడు తన పూర్వ కవిత్వాల్నీ, తన సమకాలీన కవిత్వాల్నీ నిశితంగానూ, గాఢంగానూ అధ్యయనం చేస్తూ ఉండాలి. వివిధ అభివ్యక్తి ధోరణులతో అతడికి అపారమైన పరిచయముండాలి. వాటి ప్రభావానికి తాను లోనుకాగలగాలి, అదే సమయంలో వాటిని ఎప్పటికప్పుడు పక్కకు తోసేస్తూ బయటపడ్డానికి ప్రయత్నిస్తూ ఉండాలి. దీన్ని ఆలంకారికులు వ్యుత్పత్తి అన్నారు. కాని కేవలం ప్రతిభ, కేవలం వ్యుత్పత్తి ఒక భావుకుడిని కవిగా మార్చలేవు. అందుకు నిరంతర అభ్యాసం కూడా ఉండాలన్నారు వారు.

ఒక యువకుడిగా నేను కవితారచనకు పూనుకున్నప్పుడు కూడా నాకు చాలా సమస్యలు ఎదురయ్యాయి. అన్నిటికన్నా పెద్ద

సమస్య నేను రాయాలనుకున్నది ఒకటైతే, నేను రాస్తున్నది మరొకటి కావటం. అంటే నాలో చెలరేగుతున్న ఒక భావాన్ని నేను కవితగా మార్చడంలో నా వ్యుత్పత్తి నాకెంతమాత్రం సహకరించకపోవడం. నాలో కలుగుతున్న ఆ భావాలు నా ప్రతిభ నుంచి ప్రభవిస్తున్నాయని నాకు నమ్మకం కుదరక పోవడం. బహుశా ఈ ఆత్మ సంశయం, ఇదే ప్రతి ఆధునిక కవినీ, కళాకారుణ్ణీ వేధించే సమస్య అనుకుంటాను.

నేను ఇరవైఏళ్ళ వయస్సులో రాజమండ్రిలో గోదావరి ఒడ్డున తిరుగుతున్నప్పుడు నాకు మా ఊరుచుట్టూ వికసించే అడవులూ, వసంతకాలపు పాలపూలూ, గంగాలమ్మ పండుగ గుర్తొచ్చేవి. నేను వాటినే కవితగా రాయాలని పూనుకుంటే నా మిత్రులు నేనింకా భావకవిత్వపు ఛాయల్లోనే సంచరిస్తున్నాని ఈసడించేవారు. నేను దేన్ని గుర్తు చేసుకుంటున్నానో, చిత్రిస్తున్నానో ఆ అరణ్య సౌందర్యం నేను కళ్ళారా చూసింది. నాకు వాస్తవం, కాని నా రాజమండ్రి మిత్రులెవ్వరికీ అటువంటి ఒక సౌందర్య సందర్శనమే లభించలేదు కాబట్టి వాళ్ళు దాన్ని కాల్పనిక కవిత్వంగా భావిస్తున్నారని తెలుస్తుండేది. ఆ మాటకొస్తే అసలు తెలుగులో భావకవిత్వంలోకానీ, ఆ తరువాత మరేకవీ కాని అరణ్య సౌందర్యాన్ని చిత్రించినవాడే లేడు. కానీ నా మిత్రులకి సౌందర్య స్ఫూర్తి కలిగించే కవిత్వాన్ని దేన్నైనా భావకవిత్వంగా పోల్చుకోవటం అలవాటయింది కాబట్టి నా కవిత్వంలో కనిపించే సౌందర్యం వాళ్ళకి భావకవిత్వంగా కనిపించింది.

ఈ పరిస్థితి నెమ్మది నెమ్మదిగా నాకో విషయాన్ని తెలియబరిచింది. అదేమంటే ప్రతి కవీ తన అనుభూతిని బయటకు ప్రకటించేటప్పుడు తన సమకాలీన సమాజం తాలూకు భాషతో, భావజాలంతో, ప్రాపంచిక దృక్పథంతో పెద్ద పోరాటమే చెయ్యవలసి ఉంటుందని. 'బయట సమాజం' అంటున్నప్పుడు నీ చుట్టూ ఉండే మొత్తం సమాజం మాత్రమే కాదు, అందులో మళ్ళా తరతమ భేదాలుంటాయి. అసంఖ్యాకులైన మనుషులకి,

అంటే మన అనుభూతికి దూరంగా ఉండేవాళ్ళ అవసరాలు వేరు. వాళ్ళకోసం నువ్వు కవిత్వం రాయవు. ఇక నీ చుట్టూ ఉండే పాఠకవర్గంలో కూడా అందరికీ నీపట్ల సహృదయత ఉండే అవకాశం ఉండదు. వాళ్ళకోసం కూడా నువ్వు రాయవు. కాని నీ చుట్టూ ఉండే కొద్దిమంది, నీలాగే కవిత్వం చదువుతూ, కవితా సాధన చేసేవాళ్ళుంటారు. వాళ్ళకోసం కూడా నువ్వు కవిత్వం రాయకపోయినప్పటికీ నీ కవితా సాధనపైన వాళ్ళ అభిప్రాయాల ప్రభావం చాలా బలంగా ఉంటుంది. నీ కవితా రచన పట్ల నీ నమ్మకాల్నీ, అపనమ్మకాల్నీ బలపరిచేది వాళ్ళే. వాళ్ళంతా కొన్ని ఉమ్మడి నమ్మకాలతో నీ చుట్టూ సంచరిస్తూ ఉంటారు. దాదాపుగా తమ ఉమ్మడి నమ్మకాల్నే వాళ్ళు ఆ కాలం తాలూకు యుగధర్మంగా భ్రమింపచేస్తుంటారు. వాళ్ళు యుగధర్మంగా భ్రమింపచేస్తున్న దాన్ని నువ్వు నమ్మకపోతే దాన్నెట్లా ప్రతిఘటించడం, ఆ ప్రతిఘటనని ఎట్లా ప్రకటించడమన్నదే ఒక కవిగా నువ్వు ఎదుర్కొనే అతిపెద్ద సమస్య.

నిజానికి సాహిత్యానికి ఒక యుగధర్మం ఉంటుందా? ప్రతీ దేశానికీ, ప్రతి జాతికీ తనదైన ఒక జీవలక్షణముంటుందనీ, ఆయా కాలాల్ని బట్టి ఆ జీవలక్షణం వ్యక్తమవుతూ ఉంటుందనీ సాహిత్య కళా విమర్శకులు అంటూంటారు. ఆఫ్రికాలో ఆదివాసి తెగల దారుశిల్పాలకీ, ప్రాచీనచీనాలో పట్టువస్త్రాల మీద సులలితంగా చిత్రించిన చిత్రలేఖనాలకీ మధ్య పోల్చనంత తేడా ఉండడానికి ఆ జీవలక్షణం, ఆ యుగధర్మమే కారణం. నిజమే, కాని ఒకే యుగంలో ఒకే జాతిలో వర్ధిల్లిన వివిధ కవుల్లో ఎంత మంది ఆ యుగధర్మానికి అనుగుణంగా కవిత చెప్పారని నిశితంగా పరిశీలిస్తే మాత్రం ఆ విషయాన్ని నిర్ధారించడం నిజంగా కష్టం.

ఒకే కాలంలో అనేక అత్యున్నత కవితాకృతులు ప్రభవించినప్పుడు ఏ కారణం వల్ల వాటిలో ఒక కృతి తక్కిన కృతులకన్నా అత్యున్నమైనదిగా గుర్తింపబడుతోందని ప్రశ్నించు

కుంటే దానికి కారణం ఆ కృతి చూపిస్తున్న యుగధర్మంలో కాక, ఆ కృతి ఆ యుగ ధర్మాన్ని ధిక్కరించడంలో కనిపిస్తుందని కూడా చెప్పవలసి వుంటుంది. ఉదాహరణకి, ప్రబంధ సాహిత్యాన్నే తీసుకోండి, ఆ కాలంలో వచ్చిన ప్రబంధాలన్నిటిలో, కృష్ణ దేవరాయల కాలంనాటి యుగధర్మాన్ని అన్నింటికన్నా ప్రస్ఫుటంగా ప్రతిబింబించిన కావ్యం పారిజాతాపహరణమేమో. కాని ప్రబంధ సాహిత్యంలో అత్యున్నత కావ్యంగా మనుచరిత్ర గుర్తింపు పొందడానికి కారణం ఆ కవి తన కాలంనాటి యుగధర్మంతో నేరుగా తలపడి దాన్ని ధిక్కరించడమేనేమో. ఈ రోజు మనం ప్రబంధ సాహిత్య యుగాన్ని ప్రతిబింబించే లక్షణాలుగా మనుచరిత్రలోనూ, పారిజాతాపహరణంలోనూ కూడా చూసేవి పద్య నిర్మాణానికి సంబంధించినవే తప్ప, ఆ భావజాలానికి సంబంధించినవి కావు.

మనం జీవిస్తున్న కాలంకన్నా సుదూరకాలంలో వికసించిన కృతులపట్లా, మనం జీవిస్తున్న దేశానికి సుదూరంగా ఉన్న దేశంలో వికసించిన కృతులపట్లా ఇటువంటి స్పష్టతను సాధించగలం కాని మన కాలంలో మన మధ్యలో వికసిస్తున్న కృతులపట్ల మనమింత నిర్మమత్వంతో అంచనా వేసుకోలేం. అందువల్ల మన కవితా సాధనలో మనకెదురయ్యే అతి పెద్ద సమస్య మన కవితా రచనావేళ యుగధర్మంగా నలుగురూ మాట్లాడుతున్నదీ, మనకు అంతరంగంలో స్ఫురిస్తున్నదీ ఒకటేనా అన్నదే.

ఒకవేళ నలుగురూ మాట్లాడుతున్న యుగధర్మం, నీ అంతరాత్మ నీకు చెప్తున్న సందేశం ఒకటి కాకపోతే ఏం చేయాలి? అప్పుడు నువ్వు రాస్తున్న దాన్ని ఎవరూ కవిత్వంగా అంగీకరించరు. తమ నమ్మకాలతో (భ్రమలతో) నువ్వు ఏకీభవించినంత కాలం నీతో కూడా నలుగురూ ఏకీభవించరు. అదొకరకమైన ఏకాంతం.

మామూలుగా అటువంటి ఏకాంతం నుంచి బయట పడాలంటే, బైరాగి చెప్పినట్లుగా మూడు మార్గాలు, 'పలాయనం, ఆత్మహననం, కృత్రిమశక్తుల పూజనం'. ఈ మూడూ చేయకుండా ఉండాలంటే, నువ్వు మనిషిగా జీవించాలంటే, నీ అంతరాత్మ చెప్తున్నట్లే కవిత రాస్తూండడం వినా మరోమార్గంలేదు. బహుశా ప్రాచీన అలంకారికులు అభ్యాసానికి పెద్దపీట వేయడానికి కారణం ఇదే అనుకుంటాను.

నువ్వట్లా కవితా సాధన కొనసాగిస్తుండగా, ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యంగా నీ చుట్టూ ఉన్న వాళ్ళలో కాక, మరెవరో ఎక్కడో నీలానే కవితాసాధన చేస్తున్నవాళ్ళు నీకు తారసపడతారు. వాళ్ళు కూడా నీలానే 'యుగధర్మా'నికి ఎదురీదుతూ ఉంటారు. అందుకనే సుమశ్రీ కవిత్వం చూడగానే నాకు నైతికంగా గొప్ప మద్దతు దొరికినట్టని పించింది.

3

సుమనశ్రీ చూడకముందే నేనాయన కవిత్వం చదివాను. ముఖ్యంగా ఆధునిక తొలి కవిత్వంపైనా, ఆధునిక మహా కావ్యాలపైన ఆయన అప్పుడప్పుడూ రాస్తూ వచ్చిన వ్యాసాలు చదివాను. అవి చదివినప్పుడు ఆయన కూడా, నాకులానే, సమకాలీన భావజాలపు ఉక్కు కౌగిలి నుంచి బయటపడ్డానికి ప్రయత్నిస్తున్నవాడిలాగా కనబడ్డాడు. మరొక విషయం, ఆయన ఆధునిక ఇంగ్లీషు, ఫ్రెంచి కవుల్ని అప్పటికే బాగా చదివి ఉన్నాడు. ఎంత బాగా చదివాడంటే, కొందరు ప్రసిద్ధ ఆధునిక తెలుగు కవులు ఇంగ్లీషు, ఫ్రెంచి కావ్యాలనుంచి వాక్యాలకు వాక్యాలు ఎట్లా దొంగిలించారో కూడా పసిగట్టేటంత బాగా. కవిత్వంతోపాటు, న్యూక్రిటిసిజంతో కూడా బాగా పరిచయం పెంచుకున్నాడు. ఇది 80ల తొలినాటి సంగతి.

నేను సుమనశ్రీని మొదటిసారి చూసింది 90ల మొదట్లో. సి.వి. కృష్ణారావు గారి 'అవిశ్రాంతం' పుస్తకావిష్కరణ సందర్భంగా. ఆయన్ని మొదటిసారి చూసినప్పుడు నాకు ఆయన చాలా కాలంగా తెలిసినవాడలానే అనిపించాడు. ఆయనతో వీలైనన్ని

సార్లు కలిసి కవిత్వం గురించీ, కవితా లక్షణాలు గురించీ సుదీర్ఘంగా చర్చించాలనిపించింది. 95-97 మధ్య కాలంలో నేను హైద్రాబాదులో ఉన్నప్పుడు ఆ అవకాశాలు చాలానే లభించాయి. నెల నెలా వెన్నెల కేంద్రంగా మేమెన్నోసార్లు ఎన్నో విషయాలమీద చాలా వివరంగా, సుదీర్ఘంగా మాట్లాడుకున్నాం.

అప్పటికి సుమనశ్రీ ఆధునిక సాహిత్య అధ్యయనం దాటి ఆధునికానంతర ధోరణుల్ని తీవ్రంగా అధ్యయనం చేస్తూ ఉన్నాడు. అప్పటికి తెలుగులో ఆధునికానంతర భావజాలం గురించి మాట్లాడుతున్నవాళ్ళు మరొక ఇద్దరు ముగ్గురు ఉంటారేమో. కాని ఆ భావధోరణుల నేపథ్యంలో తెలుగు కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి గాఢంగా ప్రయత్నించినవాడు మాత్రం సుమనశ్రీనే. బహుశా ఆయనకీ నాకూ కూడా ఆ విషయంలో గురుస్థానంలో ఉన్న వ్యక్తి వడలి మందేశ్వరరావుగారు. మందేశ్వరరావు గారు పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన విమర్శకులు. తన అధ్యయనాన్ని అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్టుగా నలుగురికీ పంచగలిగిన వ్యక్తి. నేనూ సుమనశ్రీ ఆధునికానంతర సాహిత్య ధోరణులపట్ల చేపట్టిన చర్చలకి మందేశ్వర రావుగారు పరిష్కర్త. మేమిద్దరం కలిసి ఆయనను రెండుసార్లు ఇంటర్వ్యూ చేశాం కూడా.

సుమనశ్రీ గురించి ఆలోచిస్తున్నప్పుడు నేను ఇలా ఒక ప్రశ్న వేసుకుంటాను. ఒకవేళ నాకు సుమనశ్రీ పరిచయం కాకపోయుంటే ఏమై ఉండేది? బహుశా నా సాహిత్య అధ్యయనానికి చెప్పుకోదగ్గ కొరత ఏర్పడి ఉండేదనుకుంటాను. ఇంకా ఆధునిక కవిత్వావరణలోనే సంచరిస్తున్న నాకు ఆధునికానంతర సాహిత్యానికి ప్రయాణించడం అంత త్వరగా సాధ్యమై ఉండేది కాదనుకుంటాను. ముఖ్యంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో యుగధర్మంగా భావించబడుతున్న భావజాలంలో ఉన్న లోటుపాట్లను అంత నిశితంగా చూడగలిగి ఉండేవాణ్ణి కాననుకుంటాను.

అందుకనే ఆయన రాసిన 'విమర్శ ఒక అన్వేషణ' (1999)కు ముందుమాట రాస్తూ 'నిజానికి పోస్ట్ మాడర్న్ జీవిత సత్యాలకి మనల్ని చేరువగా తీసుకుపోవటానికి తక్కిన మన సమకాలీన భావుకులందరికన్నా ముందే ప్రయత్నించడంలోనే సుమనశ్రీ కాంట్రిబ్యూషన్ ఉన్నది...ఆధునికానంతర జీవితం గురించి మనకు కలిగిస్తూ వచ్చిన అవగాహన మనకి సుమనశ్రీతో సాన్నిహిత్యంవల్ల మరింత బలపడిందనే నేననుకుంటాను' అని రాశాను.

4

మన ఆధునిక చేతన పాశ్చాత్య చేతన వల్ల గాఢంగా ప్రభావితమైన విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆధునిక పాశ్చాత్య సాహిత్యంలో, కళలో తత్త్వశాస్త్రంలో సంభవించిన పరిణామాలకీ, తెలుగు సాహిత్యంలో సంభవిస్తున్న పరిణామాలకీ మధ్య ఒక తేడా ఉంది. పాశ్చాత్య సమాజంలో యుగధర్మాన్ని వ్యక్తి ధిక్కరిస్తే అది ఒక ఉద్యమం. కాగా, భారతదేశంలో, తెలుగు సాహిత్యంలో యుగధర్మాన్ని సమూహాలు ధిక్కరిస్తే అది ఒక ఉద్యమం. పాశ్చాత్య సమాజంలో కళలో, సాహిత్యంలో సంభవించిన ఉద్యమాలు వ్యక్తి ప్రధానాలు. భారతదేశంలో సంభవించిన ఉద్యమాలు సమూహ ప్రధానాలు. కాబట్టి భారతదేశంలో 'వ్యక్తి'కి, పాశ్చాత్య సమాజంలో 'వ్యక్తి'కన్నా మరొక అదనపు బాధ్యత తప్పనిసరి.

పాశ్చాత్య సమాజంలో వ్యక్తి తన కాలంనాటి సామాజిక యుగధర్మాన్ని ధిక్కరిస్తే సరిపోతుంది. కాని ఈ దేశంలో, ఈ సమాజంలో వ్యక్తి తన కాలంనాటి సామాజిక యుగధర్మంతోపాటు, తన కాలంలో బలంగా పోరాడుతున్న సమూహాల భావజాలంతో కూడా తలపడవలసి ఉంటుంది. అలా తలపడడంలో అతడు ఏకకాలంలో రెండు విధాలుగా స్పందించవలసి ఉంటుంది. ఒకటి, ఆ సమూహాలు తన కాలంనాటి సామాజిక యుగధర్మంతో

తలపడుతున్నాయి కాబట్టి వాటితో చాలా అంశాల్లో ఏకీభవిస్తూ వాటి ప్రయత్నాలకు మద్దతు పలుకుతుండడం. రెండవది, అదే సమయంలో ఆయా సమూహాలు ప్రతిపాదిస్తున్న సామూహిక యుగధర్మాన్ని తాము నిరాకరించవలసినచోట నిరాకరిస్తూ రావటం.

దీన్ని రెండు ఉదాహరణలతో స్పష్టం చేస్తాను. మొదటి ఉదాహరణ గిడుగు. గిడుగు ఒక భాషావేత్తగా తన కాలంలో సామాజిక యుగ ధర్మాన్ని ప్రతిబింబిస్తున్న సాంప్రదాయిక భాషావేత్తలతోనూ, సాహిత్యకారులతోనూ పోరాటం చేశాడు. అదే సమయంలో అతడు తన కాలంలో ప్రగతికాముకులైన, అభ్యుదయశీలురైన పండిత సమూహాలతో కూడా యుద్ధం చేయవలసి వచ్చింది. గిడుగు పోరాడిన గ్రాంధిక భాషావాదులు సంప్రదాయ పండితులుకారు. వాళ్ళంతా ఇంగ్లీషు సాహిత్యం చదువుకుని ఆధునిక యుగసాధనాలైన ప్రింటింగ్ ప్రెస్సు, పత్రికలు, విశ్వవిద్యాలయాలు, పాఠ్య పుస్తకాలు, ఆధునిక విద్య, ప్రజాస్వామిక చర్చ వంటి వాటిని అనుష్ఠిస్తున్నవాళ్ళే. కాని గిడుగు వాళ్ళతో కూడా తలపడక తప్పలేదు. ఎందుకంటే ఆ ఆధునిక పండితులు భాషను ప్రమాణీకరించమనే ఒక యుగభ్రమకు లోనయ్యారు కాబట్టి.

మరొక ఉదాహరణ ఆధునిక వచన కవిత. తెలుగులో వచన కవిత రాస్తున్న కవి తన కాలంనాటి పద్యకవులతో పోరాటం చేయక తప్పదు. అదే సమయంలో తనలాగే వచన కవితకు పూనుకున్న మరెందరో కవి సమూహాలతో కూడా పోరాడక తప్పదు. వాళ్ళనుండి తన కవితను వస్తురీత్యా, నిర్మాణరీత్యా కూడా ప్రత్యేకంగా నిలబెట్టుకోకపోతే, చూపించుకోకపోతే తన కవితా సాధనకు అర్థమే లేదు. ఇది ఏ కాలంలో ఏ కవికైనా ఉండే సమస్యే అనవచ్చు. కాని ఆధునిక భారతదేశంలో ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ సమస్య మరింత స్పష్టంగా కనపడుతున్నదన్నదే నేను స్పష్టం చేయదలుచుకున్నది.

5

తెలుగు సాహిత్యంలో అంతదాకా ప్రచలితంగా ఉన్న యుగధర్మాలు 80ల తరువాత బలహీనపడుతూ వచ్చాయి. అటువంటి సందర్భంలో అందరినీ శాసించగల, అందరికీ వర్తించగల ఏకైకయుగ ధర్మమేదీ ఉండదనే మెలకువ తలెత్తుతూ వచ్చింది. అటువంటి మెలకువకు ఎందరో కవులు కారణం. కాని ఆ మెలకువను తొందరగా పసిగట్టినవాళ్ళు కొద్దిమంది మాత్రమే. 70ల్లో ఇస్మాయిల్, శేషేంద్ర, శ్రీమన్నారాయణ, శ్రీకాంతశర్మ అట్లాంటి విజ్ఞత చూపిస్తే, 80ల్లో అందరికన్నా ముందు సుమనశ్రీ ఆ విజ్ఞత చూపించాడు. ఆ ప్రయాణ విశేషాలన్నీ ఏకధారగా, ఏకధాటిగా ఈ పుస్తకంలో సౌభాగ్య వివరించాడు, వర్ణించాడు. సుమనశ్రీ కవిగా సాగించిన ప్రయాణం గురించి ఈ పుస్తకంలో సౌభాగ్య వివరించిందంతా యథార్థానికి సుమనశ్రీ ఒక వ్యక్తిగా సాగిన ప్రయాణమే. ఇది ఒకడు నడచిన దారి, నిజమే గాని, తన అంతస్సత్త్వాన్ని నిలబెట్టు కోవాలనుకున్న ప్రతి ఒక్కడూ నడవక తప్పని దారి కూడా. అందుకనే ఈ పుస్తకం చదువు తున్నంతసేపూ ఈ ప్రయాణం నాది కూడా అనిపించింది. మీరు చదివితే బహుశా మీది కూడా అనిపిస్తుంది.

హైదరాబాదు, **వాడ్రేవు చినవీరభద్రుడు**
29.09.11

ఇందులో...

సౌందర్య దాసుడు 23
కళ్ళని నమ్ముకున్న కవి 26
కవిత్వమే వూపిరయిన కవి 29
నైరూప్య గాయకుడు 32
నిరాశను దగ్గరికి రానివ్వని కవి 35
వెన్నెల జబ్బు 37
మాటే మంత్రం 40
నీటి తాకిడికి కరిగిపోయే కవి 42
మార్మికుడి మనోగతం 44
నేను కవిని ! 47
పసివాడిలా పరితపించే కవి 49
నిలదీసే కవి 52
పద్ధతిలేని ప్రకృతిని పరిశీలించే కవి 55
సంతృప్తి రహస్యం తెలిసిన కవి 58
స్పర్శను ఆకాశానికెత్తిన కవి 61
నేత్రం సుమనశ్రీ సంకేతం 64
దృశ్యం–1 67
దృశ్యం–2 69
దృశ్యం–3 71
దృశ్యం–4 73
దృశ్యం–5 77
దృశ్యం–6 80
దృశ్యం–7 83
సౌందర్య నేత్రం 86
విహ్వాల నేత్రం 89
రహస్య నేత్రం 92
అద్భుత నేత్రం 95
సమకాలీన ప్రపంచ కవులు – సుమనశ్రీ సామరస్యం 98

సౌందర్య దాసుడు

సుమనశ్రీ లలితమయిన కవి. శాంతివాది. సౌందర్య ప్రేమికుడు. సంఘర్షణని యిష్టపడడు. తనచుట్టూ వున్న ప్రకృతి విలాసంతో పరవశించే కవి. సాధనలతో సౌందర్యాన్ని, లాలిత్యాన్ని సమ్మేళనం చేసి సంగీతభరితమయిన వాక్య నిర్మాణాన్ని అలవరచుకున్నాడు. ఆయన ఏ దృశ్యాన్ని వర్ణించినా, ఏ వస్తువును ఆవిష్కరించినా ఒక మాధుర్యం నిండిన కవితాత్మకత ఆయన శైలిలో కనిపిస్తుంది. కొంతమేరకు ఆయన రూపవాది. రూపవాదుల ప్రత్యేకత ఏమిటంటే వాళ్ళ అభివ్యక్తి అన్నదే కవితాత్మకమయింది. కవిత్వానికి వేరుగా వచనం చెప్పడం దాదాపు వాళ్ళ చేతకాదని చెప్పవచ్చు. అంటే అభివ్యక్తి అన్నదే కవితాత్మకంగా వుండడమన్నది వాళ్ళ చిరకాల ప్రయత్నం వల్ల సాధించుకున్నది. వస్తువుకన్నా అభివ్యక్తిలో ఆకర్షణ వుండడమన్నమాట. అట్లాంటి సందర్భంలో వస్తువు దానికి

అనురూపమయిందయితే యిక చెప్పాల్సిన పన్లేదు. తగిన వస్తువు లేనప్పుడు రూపవాదులు తేలిపోతారు.

కానీ సుమనశ్రీ గారికి అట్లాంటి సమస్య రాలేదు. ఆయన తన రూపానికి తగిన వస్తువునే ఎన్నుకుంటాడు. లేదా ఎన్నుకున్న వస్తువు ఆయన రూపానికి ఒదిగి పోతుంది.

ఆకాశం గురించి ఆయన వర్ణన చూడండి –

ఆకాశం శూన్యం కాదు నిత్య చైతన్య వసంతం
ఆకాశం నీలి సముద్రమే కాదు
రంగుల్ని పుక్కిలించే నిత్య వినూత్న తేజం
వేల గోళాల్నీ లక్షల నక్షత్రాల్నీ
వాయువేగంతో పరిగెత్తే గెలాక్సీల్నీ మోసే ఆకాశం
నీ కళ్ళముందు నిత్యం వికసించే అపూర్వ పుష్పం.

ఆకాశాన్ని అన్ని కోణాల్నించీ ప్రదర్శిస్తాడు. నిశ్శబ్దంగా కనిపించే ఆకాశంలో నిత్య చైతన్యాన్ని దర్శిస్తాడు. నీలి సముద్రాన్ని చూస్తాడు. అది రంగుల్ని పుక్కిలించే వినూత్న తేజమంటాడు. దాని మధ్య సంచరించే గెలాక్సీల్ని చూస్తాడు. చివరిగా మెరుపు మెరిపిస్తూ అది 'నిత్యం వికసించే అపూర్వ పుష్ప'మంటాడు.

ఒక తన్మయ తపస్సులో లీనమయి మంద్రగానాన్ని మనోహరంగా ఆలపించే కవి కనిపిస్తాడు. ఆకాశం అద్భుతమయింది. ఆ అద్భుతం ముందు పసివాడులా కవి వున్నాడు. ఆకాశం అతన్ని ఒంటరిగా వదలదు. ఎప్పుడూ అతనికి తోడుగా వుంటుంది. అతన్ని ఆదుకుంటుంది. అతన్ని తాజాగా వుంచుతుంది. ప్రకృతిలో సాన్నిహిత్యం వున్న కవి ఒంటరికాడు. అతను ఏకాంతగీతాలు ఆలపించడు. అతని గానంలో ఆత్మీయ స్పర్శ వుంటుంది. మనుషులనించీ అందుకునే అనురాగంకన్నా ప్రకృతినించీ అందుకునే ప్రేమ విశాలమైంది, నిలకడ కలిగింది. ప్రకృతి అతనికి పాక్షికమయిన పరిచయం కాదు. ఆకాశం అతనికి కాలక్షేపానికి కాదు. అది అతని ఆత్మతో అనుసంధానం కలిగింది. అతను ప్రకృతినే నమ్ముకున్నవాడు. ఆకాశాన్నే నమ్ముకున్నవాడు. నమ్ముకున్నవాళ్ళని ఆకాశం నట్టేట్లో వదల్దు.

'ఆకాశం నీపై జాలిపడి ఆదరిస్తూనే వుంటుంది
వెలుగు నీడల భోజనాన్ని
ఉదయాస్తమయాల కంచాల్లో వడ్డిస్తూనే వుంటుంది,

అట్లా ఆకాశం దయకు పాత్రుడయిన సుమనశ్రీకి ఉదయాస్తమయాల కంచాల్లోని వెలుగు నీడలే ఆహారం. ఈ మాటల్లో జీవితానికి తలవొంచిన కవి కనిపిస్తాడు. కష్ట సుఖాల్ని అనివార్యంగా ఆమోదించే నిరహంకారి కనిపిస్తాడు.

కళ్ళని నమ్ముకున్న కవి

సుమనశ్రీకి కళ్ళంటే ప్రాణం. ఇస్మాయిల్ గారిని 'చెట్టుకవి' అన్నట్లు సుమనశ్రీ గారికి 'కళ్ళ కవి' అనవచ్చు. ఆయన కవితా సంపుటాల్లో ఎక్కువ భాగం నేత్రాల ప్రసక్తి వున్న శీర్షికలే. 'రక్త నేత్రోదయం, రెప్పలమధ్య ఆకాశం, నేత్రం నా సంకేతం'. అంటే నేత్రాలకు సుమనశ్రీగారు అధిక ప్రాధాన్యమిస్తారని తెలుస్తుంది. ఆయన్ని గొప్ప ఆశ్చర్యానికి గురిచేసే వాటిలో కళ్ళు ప్రాధాన్యం వహిస్తాయి.

'ఆమె కళ్ళలో అనంతాంబరపు నీలినీడలు కలవు' అన్నాడు కృష్ణశాస్త్రి. ఆమె కళ్ళముందు అనంత విశ్వం అదృశ్యమవుతుందంటాడు సుమనశ్రీ.

తొలి కవితల్లో సౌందర్యం ఒక్కటే కాక సమస్త ప్రపంచ రాగద్వేషాల్ని కళ్ళతో కలుపుతాడు. కొన్ని సందర్భాల్లో ఆత్మీయ స్పర్శ వుంటుంది.

నీ కళ్ళెలా నా లోతుల్ని
వెతుకుతూంటాయో నాకు తెలుసు
నా కళ్ళు వొదిగే అనురాగపు దారప్పోగుల్ని
నీ కళ్ళు ఎంత జాగ్రతగా
ఏరుకుంటాయో నాకు తెలుసు.

ఆ కళ్ళు అతని లోతుల్ని కొలుస్తాయి. అతని కళ్ళు అల్లే అనురాగపు దారప్పోగుల్ని ఏరుకుంటాయి. మెల్లమెల్లగా ఆ చూపులకు అతను లొంగిపోతాడు. అదృశ్యమయిపోతాడు.

నన్ను ఒక పిల్లనగ్రోవిని చేసి

జీవన గీతాన్ని ఆలపిస్తున్నావు అంటూ 'ఈ గదిలో ఇప్పుడు రెండే రెండు ఊపిరులు సువాసనల్ని చిమ్ముకుంటున్నాయి' అంటూ మనోహరంగా చెబుతాడు. చూపుల్ని రకరకాలుగా వర్ణిస్తాడు.

కళ్ళు కలల పడకటిళ్ళు
కొన్ని చూపులు రక్తపు చుక్కలు
చూపులు కొన్ని గాజుపెంకుల్లా గుచ్చుకుంటాయి
ముళ్ళ కంపలతో ముట్టుకుంటాయి.

తనకు యిష్టంలేని కళ్ళనయినా యథాతథంగా ఆవిష్కరిస్తాడు. లోకంలో ఎందరో వున్నారు. అందరి కళ్ళు ఆనందాల్నే వర్షించాలని లేదు. ఎన్నో కళ్ళు ఎన్నెన్నో భావాలకు కేంద్రాలు. సంతోషపెట్టేవి, బాధపెట్టేవి ఎన్నెన్నో! యిష్టమున్నా లేకున్నా అవి ఎదురుపడతాయి.

రోద్ల సముద్రాలలో కొట్టుకొచ్చే పడవలు కళ్ళు
నా గుండెగది వాకిళ్ళు కళ్ళు
రెప్పల పొత్తిళ్ళ మధ్య
చలిలో వొణికే పసిపిల్లలు కళ్ళు
కొన్ని కళ్ళు చల్లగా ప్రశాంతంగా
తెల్ల జెండా లెగరేస్తూ వుంటాయి
......కొన్ని కళ్ళు సంకెళ్ళు వేస్తాయి

.....కొన్ని కళ్ళు ఎరుపెక్కి క్రోధంతో ఎర్రజెండా లెగరేస్తాయి.

ఇట్లా విభిన్న నేత్రాల విశృంఖల విహారాన్ని విస్మయంతో ప్రదర్శిస్తాడు. కొన్ని రకాలయిన ప్రదర్శనలో వ్యక్తులకన్నా సామూహిక చేతనని ఆవిష్కరించడం జరుగుతుంది. అప్పుడు వ్యక్తిగత అనుభవం స్థానంలో దర్శించిన దృశ్యాల సమీకరణ వుంటుంది. నైరూప్య ఆవిష్కరణ వుంటుంది. మన చేతనని బట్టి దాని అవగాహన వుంటుంది. సాధ్యమయినంత మేర పాఠకుని అంతరంగానికి ఆమోదకరమయిన సమన్వయ చిత్రణనే సుమనశ్రీ ఇష్టపడతారు. సంఘర్షణాత్మకమయిన నేత్ర దర్శనకన్నా సౌందర్యభరిత నేత్ర దర్శనలో సుమనశ్రీ ప్రతిభ వేయి ముఖాలుగా విస్తరిస్తుంది.

కవిత్వమే వూపిరయిన కవి

అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన – అన్నాడు వేమన.

పద్య రచనలో సాధన అవసరం. నిరంతర సాధనలో వచన కవితను నిర్మల ప్రవాహంలా సుమనశ్రీ రూపొందించాడు. కవిత్వం తన ప్రాణధాతువని ఆయన చెప్పుకున్నాడు.

కవిత్వం నాకు ఆక్సిజన్
నాలో వూపిరి పోస్తూ వుంటుంది
నేను బ్రతుకుతున్న ప్రతిక్షణం
నన్ను చలి చీమలా వెంటాడుతూ వుంటుంది
...ఏనాడైనా అక్షరం నాలో కదలకపోతే

అక్షయమై నా కవితలో ఎదగకపోతే

నా రెప్పల మధ్య ఆకాశం నిర్జీవమైపోయినట్లే

ఎప్పుడో ఇరవయ్యేళ్ళ క్రితమే ఆయన శపథం చేశాడు. కవిత్వం నా ప్రాణం. నేను బ్రతికినంత కాలం అది నన్ను వెంటాడుతూ వుంటుంది. అది నాలో కదిలితే నాలో స్పందన వున్నట్లు. అది కదలకుంటే తను నిర్జీవంగా మారిపోయినట్లు అంటాడు. అంటే 'కవిత్వం లేకుంటే తను లేను' అంటున్నాడు. తన మనసులో కవిత కదిల్తే అది తనువంతా అల్లుకుంటుంది. తన్మయ పరుస్తుంది. కవిత యిచ్చే ఆనందాన్ని ఈ సృష్టిలో ఏదీ తనకు యివ్వలేదని ఆయనకు తెలుసు.

సుమనశ్రీ గారికి ఏదయినా ఒక పదాన్నివ్వండి. దానిచుట్టూ బంగారు తీగలు అల్లుతాడు. పూలు పూయిస్తాడు. ఆయన వూహలో ఒక పదం మెదిల్తే చాలు. దాన్ని పువ్వులా విచ్చుకునేలా చేస్తాడు. వేల రేకులు వికసించేలా చేస్తాడు.

'మాట'ను తీసుకుంటాడు.

'ఇద్దరు వ్యక్తుల మధ్య నిశ్శబ్దాన్ని చీలుస్తుంది మాట'

మనిషిలో అజ్ఞాతంగా వుండే మానవత్వాన్ని భగ్గున వెలగిస్తుంది మాట' – ఇట్లా కొనసాగుతుంది.

'సముద్రాన్ని' తీసుకుంటాడు.

'సముద్రం నువ్వనుకున్నట్లు ఒక వాక్యం కాదు.

దాని కెరటాల రహస్యం నీకెప్పటికీ బోధపడదు'

ఇట్లా సముద్రాన్ని వివిధ కోణాల్లో వర్ణిస్తాడు. అంటే 'పద'మన్నది రూపొందడం వెనక అనంత అనుభవముంది. కేవలం అది ఒక పరిమిత భావానికే పరిమితం కాదు. ఆ రహస్యం తెలిసిన కవి సుమనశ్రీ. కాబట్టే సుమనశ్రీ శ్రీశ్రీ లాగా 'అరిస్తే పద్యం, స్మరిస్తే వాద్యం' అనగలడు.

'మనసొక సీతాకోక చిలక

ఊపిరితిత్తుల్ని రెండువేపులా రెక్కలుగా కలిగివున్నా

భౌతికంగా ఎగరలేదు'

వంటి వినూత్న ఆవిష్కారాలు చేస్తాడు. మనల్ని విచిత్ర అనుభూతులకు లోను చేస్తాడు. వైవిద్యభరితమయిన భావాల్ని, దృశ్యాల్ని అందించడంలో సుమనశ్రీ

అత్యాధునికుడు. వివిధ ప్రపంచ కవుల సమకాలీన కవిత్వాన్ని అనునిత్యం ఆయన అధ్యయనం చెయ్యడంవల్ల ఆయన్ది అత్యాధునిక రీతి.

సుమనశ్రీ నవ్యత ప్రతి వాక్యంలో కనిపిస్తుంది –

'నీళ్ళు కూడా సూదుల్లా గుచ్చుకుంటాయి

చల్లగా వొంటి మీద పాకుతూ

నాల్కలతో నాకుతూ కోరలతో కాటేస్తాయి'

అట్లా నీటిని వివిధ రూపాల్లో ప్రదర్శిస్తూ నివ్వెర పరుస్తాడు. ఒక మాటని దోసిట్లోనించీ ఆకాశానికి వదుల్తాడు. అది వేల వేల రూపాలతో, రూపాంతరాలతో విస్తరిస్తూ మనల్ని మహాశ్చర్యానికి గురిచేస్తుంది.

నైరూప్య గాయకుడు

నైరూప్య విషయాలకు ఆకారాల్నిస్తూ పదాల ప్రవాహంలో మనల్ని ఉల్లాసంగా సుదూర తీరాలకు తీసుకుపోతాడు సుమనశ్రీ. గానంలో సంగీతం ప్రధానం. సాహిత్యం తరువాత. శైలికి ప్రాధాన్యమిచ్చే కవుల్లో చెప్పే విధానం ముఖ్యం. అట్లా అని వస్తువుని విస్మరించడమూ వుండదు. శైలి బలంగా వుంటే వస్తువు మరింత శక్తిని పుంజుకుంటుందని వాళ్ళ భావన.

సుమనశ్రీ కాలం గురించి రాసిన కవిత చూడండి.

కాల స్పృహ కవులందరికీ వుంటుంది. మనుషులందరికీ వుంటుంది. అది వ్యక్తులు దానిని ఇచ్చే అర్థాన్ని బట్టి వుంటుంది. దాన్నిబట్టే దానికి కళ వస్తుంది, పరిమళమబ్బుతుంది.

'కాలం అల్లిన జల్లెడలోంచీ
క్షణాలు జారిపోతూ వుంటాయి

నీ కసలు స్పర్శే వుండదు
ఒక్కొక్కప్పుడు కాలం నీకు జొన్నపొత్తుల్ని కాల్చి పెడుతుంది
మరొకప్పుడు సుఖం కొండమీంచి
దుఃఖ సముద్రాల్లోకి తోసేస్తూ వుంటుంది'

కాలం మన అదుపులో లేనిదని, దాన్ని మనం పట్టుకోలేమని, అసలు దానికి సంబంధించిన స్పృహే మనకు వుండదని, అది మన అంచనాలకందనిదని, మనల్ని అది ఆనంద పెడుతుందని, దుఃఖపెడుతుందని, కానీ ఎప్పుడు ఏంచేస్తుందో మనకు తెలీదని చెబుతాడు. ఈ క్రమాన్నంతా ఒక నైపుణ్యం తెలిసిన పనిమంతుడి నిర్ణయాలు నిమ్మళంలా కొనసాగిస్తున్నాడు.

కాలంతో కలిసి నాట్యం చేస్తాడు.

'కాలం ప్రకృతి నిశ్శబ్దంగా విన్పిస్తున్న
అనంత షెహనాయీ సంగీతం
కాలం నీ ముందు నించే నిశ్శబ్దంగా నడిచిపోతూ వుంటుంది'

సుమనశ్రీ అనుభూతులు, ఆలోచనలు గంభీరమయినవి. విశాలమయినవి. విస్తృత ప్రాతిపదిక కలిగినవి. వాటికి సార్వకాలీనత వుంటుంది. సంఘటనకి, సందర్భానికి పరిమితమయినవి కావు. ఆయన కాలం గురించి రాసినా, కళ్ళ గురించి రాసిన అందులో కాలానికి అందనిది కళకళలాడుతుంది. పరిణామానికి అందని పరిమళం అందులో వుంటుంది.

కాలంలాగే ఆయన కవిత్వం పరిధులకు లొంగదు, పరిమితులకు లొంగదు. కవిత్వాన్ని సాధనచేసే దశలో కవిత్వానికి సంబంధించిన ఆ రహస్యాన్ని ఆయన సొంతం చేసుకున్నట్లనిపిస్తుంది.

సమకాలీన సమస్యలకు 'తక్షణం' స్పందించి సామాజికమయిన, వర్గసంబంధ మయిన గుర్తింపుల్తో, రాణింపుల్తో గర్వించే వాళ్ళని చూసి సుమనశ్రీ నవ్వుకుంటాడు. కారణం జీవిత కాలంలోనే మరణించే వాళ్ళ శక్తి సామర్థ్యాల పరిమితులు ఆయనకు తెలుసు.

జర్మన్ మహాకవి 'ఇష్టాలకు, సెంటిమెంట్లకు వెంటనే గుర్తింపు వస్తుంది. కానీ హేతుబద్ధమయిన దానికి రాదు. ఐనా హేతువుకు కట్టుబడిన వాళ్ళు ఎప్పుడూ కొంత

మంది బలంగా వుంటారు' అంటారు. హేతువు అన్నది బలమైన అనుభూతులకు కూడా వుంటుంది. తక్షణ ప్రయోజనాలతో దానికి నిమిత్తం వుండదు.

కాలం నీకు తెలీకుండా నీళ్ళగదిలో జారిపోతూ వుంటుంది
నవ్వు కాలాన్ని కౌగిట్లో బంధించాలని చూస్తావు
కాలం పామై కరుస్తుంది నిన్ను
నీవు పాడుతున్న పాట ఒక్కసారిగా ఆగిపోతుంది
నువ్వు తీస్తున్న ఊపిరి అందకుండా పోతుంది
నీ కసలు స్పర్శే ఉండదు' అంటాడు.

కాల స్పృహ వున్న కవి సుమనశ్రీ. పాశ్చాత్య కవిత్వ రీతుల్తో గాఢ పరిచయమున్న కవి సుమనశ్రీ. అందుకనే ఆయన అభివ్యక్తిలో ఒక నవ్యత, నాణ్యత కనిపిస్తాయి.

నిరాశను దగ్గరికి రానివ్వని కవి

వివిధ రంగాల్లోలాగే కవిత్వ రంగంలోనూ విభిన్న అభిప్రాయాలుంటాయి. ఘర్షణలుంటాయి. ఆశావాదాలు, నిరాశావాదాలూ వుంటాయి. కొందరు ప్రయోజన వాదులు, కవిత్వం కోసమే కవిత్వమనే వాళ్ళు కొందరు. రకరకాల సిద్ధాంతాలకు తగులుకున్న వాళ్ళు కొందరు.

సుమనశ్రీ వాదాలకు, సిద్ధాంతాలకు, ప్రయోజనాలకు వీలయినంత దూరంగా వుండే కవి. తను కవిని. అది చాలు. యింకేం కావాలి? తనకో దర్శనవుంది, వ్యక్తీకరణ విధానముంది. అది చాలు, అదనంగా ఏదయినా ఆశించడం అత్యాశే అని ఆయనకు తెలుసు.

అందుకనే తన కళ్ళు మూతలు పడనంత కాలం చూస్తూనే వుంటానంటాడు.

'కిటికీ కన్ను కంతల్లోంచి ప్రపంచాన్ని చూస్తున్నాను
శూన్య సముద్రంలా కన్పిస్తోంది
నేను శూన్యాన్ని దీక్షగా చూస్తున్నాను
శూన్యంలో నాకు శబ్దాలు విన్పిస్తున్నాయి, మూల్గులు విన్పిస్తున్నాయి
బండరాళ్ళు పగులుతున్న చప్పుడు విన్పిస్తోంది
బ్రతుకు పడవ మునుగుతున్న శబ్దం విన్పిస్తోంది
ఒక పక్క గాజుల గల గల విన్పిస్తోంది
మరోపక్క పిల్లవాడి ఏడుపు విన్పిస్తోంది'

ఆయన కిటికీలోంచీ ప్రపంచాన్ని చూడడం ప్రారంభించాడు. మొదట అది శూన్యంలా అనిపించినా మెల్లగా అందులో కష్టాలు కనిపించాయి, నిస్సహాయత కనిపించింది. అందం కనిపించింది. ఆర్తనాదం కనిపిస్తుంది. ఆదిమవేదంలో అన్నట్లు అన్నీ శూన్యం నించే వచ్చాయి. కానీ అవి మన అంతరంగాన్ని తాకుతాయి. సుఖ దుఃఖాల్ని రేకెత్తిస్తాయి. వీటికి మన మనఃకల్పితమయిన యిష్టాయిష్టాల్తో నిమిత్తం లేదు. కానీ ఒకసారి అవి మన అనుభవానికి వచ్చాక వాటి గురించి ఆలోచించకుండా వుండలేం. అస్తవ్యస్తమయిన పరిస్థితిని, తారుమారయిన స్థితిని మనమేదో చెయ్యాలి. ఒక క్రమబద్ధతని ఏర్పాటు చెయ్యాలి. అది మన బాధ్యత అని కవి గుర్తిస్తాడు.

ఈ ప్రపంచం యింకా బ్రతికి వున్నట్లే వుంది
నా కళ్ళు మూతలు పడనంతకాలం
ఈ వెలుగు నాకు కన్పిస్తూనే ఉంటుంది
చీకటి చిచ్చును నా కళ్ళు చీలుస్తూనే వుంటాయి.

ఈ ప్రపంచం యింకా చనిపోలేదు. ఆర్తనాదాలు పెడుతున్నా యింకా దాంట్లో ప్రాణ స్పందన వుందని కవి చూశాడు. అది అంధకారంలో అలమటిస్తూ వుందని కవి గమనించాడు. కానీ ఆయనకు కాంతి స్పృహ వుంది. కాబట్టే చీకటి చిచ్చును నా కళ్ళు చీలుస్తూనే వుంటాయంటాడు. అదొక భావనాత్మకమయిన తీవ్రత. తీవ్ర భావుకత్వంతో వున్న కవి సత్యసందర్శన చేసిన కవి. తన స్థితి గురించిన ఒక నిశ్చయాత్మకత ఆయనకుంది. కానీ తనలా లేని ప్రపంచాన్ని చూసి తల్లడిల్లే కవి సుమనశ్రీ. మార్పుకు తపించే మానవతామూర్తి.

వెన్నెల జబ్బు

సుకుమారులు చిన్ని ఆందోళనకు కూడా తట్టుకోలేరు. సౌందర్య ప్రేమికులు సౌందర్యాన్ని గాయపరిస్తే బాధపడతారు. కవులకు ఒక గంధర్వలోకముంది. అది స్వప్నమయినా, వాస్తవమయినా వాళ్ళా తేడాని గుర్తించరు. ఆ లోకంలో ఒక అందాల రాసి వుంటుంది. ఆమె కవికి అనురాగాన్ని పంచుతుంది. ప్రపంచంలో తిరిగి కలసి పోయిన అతనికి ఆమె ఓదార్పునిస్తుంది. అన్ని ఆనందాలనీ అందిస్తుంది.

ఒక ఏకాంత మనోహర దృశ్యాన్ని సుమనశ్రీ వర్ణిస్తాడు. అక్కడ ఆమె, అతను మాత్రమే వుంటారు. చుట్టూ పరవశం తప్ప అలికిడి వుండదు.

'నా గుండెకు నీ గుండె తగుల్తుంటేనో
ఊపిరి మల్లెల సువాసన గుబాళిస్తూంటేనో

మెత్తని నీ శృంగార స్పర్శ తగుల్తూంటేనో

మెల్లగా వినవచ్చే జాజ్ సంగీతంలా నువ్వు మాటల్ని పలికిస్తూంటేనో

జేవురించిన సాయంత్రాన్ని దాటుతూ

ప్రశాంతంగా సముద్రంలోకి జారిపోయే సూర్యుడిలా

నిద్రలోకి నెమ్మది నెమ్మదిగా జారిపోతూంటాను.'

ఒక మధుర మనోహర దృశ్యాన్ని సుమనశ్రీ ఆవిష్కరించాడు. ఇక్కడ భౌతిక సుఖాన్ని దాటిన ఆహ్లాదమేదో మన అంతరంగాన్ని తాకుతుంది. ప్రపంచమంతా తిరిగి పరివేదనతో యింటికి చేరిన వ్యక్తికి దొరికిన ప్రేమ, ఆప్యాయత అక్కడున్నాయి. వాటివల్ల కవి కష్టాల్ని మరచిపోయాడు. పగలంతా ఆకాశమంతా తిరిగి అగ్ని గుండంలా మారిన సూర్యుడు ప్రశాంతంగా సముద్రంలోకి జారినట్లు నిద్రలోకి జారుకున్నాడట!

ఆమె పట్ల అతనికి ఆరాధన !

'వంటరిగా నా చెయ్యి నువ్వు వదిలేసినప్పుడు

వంతెనల మీంచి చీకటి రైళ్ళు పోతున్నప్పుడు

నన్ను చీకటి కమ్ముకుంటుంది

అంటూ ఆమె తోడులేనిదే తనెంత ఒంటరినో, ఏ చీకటి లోయల్లో పడిపోతానో అని భయపడతాడు. ప్రపంచంలో ప్రతి వ్యక్తికీ తన అంతరంగాన్ని తిప్పుకోవడానికి మరో వ్యక్తి అవసరం. ఆ వ్యక్తి తన జీవిత భాగస్వామి ఐతే అంతకన్నా అదృష్టం వుండదు. మనసును అర్థం చేసుకునేది ఆమే. హృదయాన్ని కళ్ళలో చదవగలిగేది ఆమే.

ఆ ఆనంద తీరంలో పడి సుమనశ్రీ కొట్టుకుపోతాడు. తన పరవశానికి పరమాద్భుతంగా కవిత్వ రూపాన్నిస్తాడు.

ఈ ఆనంద తుఫానులో మరికొన్ని క్షణాల్లో తను ఏ సప్త సముద్రాల ఆవలకో

కొట్టుకుపోతానని మనసు తేలిపోతుంది.

ఇదంతా ఈ వ్యవహారమంతా వెన్నెల స్పృహలో జరిగింది. ఆనందంలో గంటలు గడిచిపోయాక చూస్తే వెన్నెల లేదు.

'వెన్నెల ఈ వేళ ఎక్కడికి పారిపోయిందో ఏమో

నా కనురెప్పలు విచ్చుకోవడమే లేదు

కాంతి స్వర్గాల కలవాటు పడ్డ నా కళ్ళు

చీకట్లోకి తెరుచుకోవడం లేదు

...మళ్ళీ మళ్ళీ వెన్నెల కోసమే ఎదురు చూడ్డం

పెద్ద జబ్బయిపోయింది !

ఒక వాతావరణాన్ని సృష్టించుకోవడమన్నది ఎవరికయినా, ఎప్పుడయినా అవసరం. జీవితానికి ఒక అర్థాన్ని ఏర్పరచేది అదే. అది వ్యక్తిగత జీవితమయినా, మానసిక ప్రపంచమయినా అది అవసరం. తన ప్రపంచాన్ని తను సృష్టించుకోవడంలో సుమనశ్రీ నిమగ్నమయి వుంటాడు. ఆ ప్రపంచం వెన్నెలతో నిండివుంటాలనుకుంటాడు. లేకుంటే వెన్నెల కోసం ఎదురుచూస్తాడు.

మాటే మంత్రం

కొంతమందికి మౌనం యిష్టం. కానీ సుమనశ్రీకి మాట యిష్టం. సుమనశ్రీ సామాజికుడు. మనుషులంటే ఆయనకు యిష్టం. మాట్లాడటమంటే ఆయనకు యిష్టం. మనుషుల్ని కలవడంలో, మాటల్ని పంచుకోవడంలో మాధుర్యం తెలిసినవాడాయన. మనిషిని మనిషి మాటని మనోహరంగా వర్ణిస్తాడు.

మనిషి మాటల చెట్టు కదా !

మాట అనురాగపు తేనెపట్టు కదా !

నా చుట్టూ విన్పిస్తున్న శబ్దాలన్నీ మాటలే కదా !

మాటే కదా మనిషికీ మనిషికీ మధ్య వంతెన

అలా మాటల్ని పూలలా మనమీద చల్లుతూపోతాడు. మనతో మాట్లాడాలనుకునే, మాటను నమ్ముకున్న యితన్ని పలకరించాలని మనకనిపించేలా చేస్తాడు. మాటని పాజిటివ్‌గానే

చూస్తాడు. మాటలో అనురాగపు తేనేతుట్ట వుందంటాడు. ఒకర్ని ఒకరు అర్థం చేసుకోడానికి మాట వంతెన అంటాడు. నోరులేని పక్షులు, జంతువులు చెట్లు మాట్లాడలేవు. మాటమాత్రమే ఆటంకాల్ని అధిగమిస్తుందంటాడు.

'ఆస్తీ అంతస్తుల కులమత గోత్రాల

ఎత్తు పల్లాల్నీ అగాధాల్నీ

దాటాలంటే మాటల్ని వాడక తప్పదు' అంటాడు..

మాట మనుషుల మధ్య అంతరాలని అంతం చేస్తుందంటాడు. మాటని మన ముందుంచి మంత్రదండంతో దాన్ని తాకి దాని విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు.

'మాటే కదా మనిషి ఆయుధం

ఎదుటివాడి గుండెల్లోకి దూసుకుపోయేది

మాటల తూటాలతోనే కదా

మబ్బులు కమ్మిన చీకటి ఆకాశం కూడా

మాటల మెరుపుల్తోనే కదా ఒక్కసారిగా వెలిగేది

మాటే కదా మనిషికీ మనిషికీ మధ్య దీపం ముట్టించేది' అంటాడు. మాట ఆయుధం. గుండెల్లోకి దూసుకుపోతుంది. మబ్బులు కమ్మిన చీకటి ఆకాశం మాటల మెరుపుల్తో వెలుగుతుందట. అంటే దిగులు నిండిన మనసుకు ఒక చల్లటి మాట ఓదార్పునివ్వడం అందరి అనుభవంలో ఎప్పుడో ఒకప్పుడు వుంటుంది. మాట శక్తిని గ్రహించిన మనిషి సుమనశ్రీ. మనిషి పువ్వులా విచ్చుకునేది మాటద్వారానే. ఒకరి కొకరు అర్థమయ్యేది మాట ద్వారానే అంటాడు.

జనం మధ్య దొర్లిపడే అమృతపు చుక్కలు

జనం కలిసి మెలిసి జలకాలాడేది ఈ అమృత స్రోతస్వినిలోనే

తప్పి తీర్చుకునేది ఈ అమృతాస్వాదనలోనే. చలనం లేని చైతన్యం లేని సమాజాన్ని వూహించండి. అన్ని దిక్కులా నిశ్శబ్దం అల్లుకున్న స్థితిని వూహించండి. భయమేస్తుంది. కలకలంలో కళ వుంది, కవిత్వముంది, ప్రాణస్పందన వుంది అని తెలిసిన కవి సుమనశ్రీ.

అందుకే మనుషుల మాటల్తో పరిసరాలు గలగలలాడుతూ వుంటే అది అమృతపు చుక్కలు జనం మధ్య పడడంగా భావిస్తాడు. నిర్జీవ వాతావరణానికి చలనం, చైతన్యం, జవం, జీవం మాట ద్వారానే వస్తాయంటాడు.

నీటి తాకిడికి కరిగిపోయే కవి

సున్నితమయిన కవుల్ని లొంగదీసుకోవడం సులభం. జర్మన్ మహాకవి గొథె 'రోజూ వీలయితే ఒక చిత్రాన్ని చూడు. ఒక పాట విను, లేదా ఒక కవిత చదువు' అన్నాడు. భావుకుడయిన సుమనశ్రీ నిత్య నిరంతర జీవన చర్యలో యివన్నీ భాగాలే. కంటి ముందు కదిలిన దృశ్యానికి, మనసులో మెదిలిన భావానికి, ప్రకృతిలో వచ్చిన పరిణామానికి పరవశంగా ఆయన లొంగిపోతాడు. ఒక్క చిరునవ్వు చాలు, ఒక్క చినుకు చాలు ఆయన్ని లొంగదీసుకోడానికి.

సుమనశ్రీ చూస్తూ వున్నాడు. చినుకులు మొదలయ్యాయి. చూస్తూ వుండగానే పరిసరాలన్నీ వర్షంతో నిండిపోయాయి. తన కవిత్వపు తీగల్ని సవరించి గానం ప్రారంభించాడు.

ఆకుల ఈనెల మీద నీళ్ళు
ఇంటి ముంగిట గడ్డి పరకల్ని మింగేస్తూ నీళ్ళు

నగరం నడిరోడ్ల మీద నఖక్షతాల్ని సృష్టిస్తూ నీళ్ళు
...ఎత్తు పల్లాల్ని ఒకటి చేస్తూ
రోడ్ల చెంపల గాట్లు దాచేస్తూ నీళ్ళు.

కాంక్ష మొదలయినట్లు వర్షం మొదలయింది. అన్నిటినీ ఆక్రమించింది. ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న వుద్వేగంలో, కాంక్షలో వర్షాన్ని చూస్తాడు. వర్షంలో కాంక్షని కళ్ళకు కడతాడు. ఒక వింత అనుభూతికి మనల్నిలోను చేస్తాడు. నడిరోడ్డు మీద నఖక్షతాల్ని చూపిస్తాడు. రోడ్ల చెంపల గాట్లని నీళ్ళు దాచేస్తున్నాయట!

ఒక లలిత శృంగార తీరాలని కళ్ళకు కట్టిస్తాడు. ఈ విచిత్ర శిల్పిని చూసి మనం విస్తుపోతాం. అతని నైపుణ్యానికి అప్రతిభులమవుతాం.

ఈ హడావిడిలో ఉదయమే ఆకాశం పెట్టుకున్న
ఎర్రబొట్టు ఎక్కడ కరిగిపోయిందో తెలీటం లేదు
పొగచూరి పగబట్టిన తాచులా బుసలు కొడుతోంది

ఉత్తుంగ తరంగాలతో ఎగిసిపడుతున్న రెండు సముద్రాల పరిష్వంగంలో సమస్త సృష్టి స్తంభించినట్లు తన అపూర్వ ప్రతిభతో మనల్ని మ్రాన్పడేలా చేస్తాడు. అంతులేని అతని వూహలు మనల్ని ఎక్కడికో కొట్టుకుపోయేలా చేస్తాయి. మనమే వర్షమై, వర్షమే మనమై, మనలో తను, తనువులో కలిసిన మనసు ఒక విశ్లేషణకు లొంగని వివశత్వానికి సుమనశ్రీ మనల్ని లోను చేస్తాడు.

మనిషి ప్రేమకు లొంగిపోవాలి, గాలికి లొంగిపోవాలి, నీళ్ళకు లొంగిపోవాలి. ఆత్మ సమర్పణలో ఆనందపు అవధుల్ని అందుకునే కవి సుమనశ్రీ.

కాళ్ళాడిస్తూ కళ్ళమీదా చేతుల మీదా
నుదుటి మీదా జల్లు కుంటున్నప్పుడు
ఒళ్ళు ఝల్లు మనడం తప్ప నీకు మరేమీ తెలీదు
నీ గొంతు దిగుతున్నప్పుడు
కొబ్బరి నీళ్ళ తియ్యదనం తప్ప మరేమీ గుర్తుకు రాదు

పిల్లలు వర్షం వస్తే ఎగిరి గంతేసి వర్షంలో తడుస్తూ వుంటారు. పెద్దలు జలుబు చేస్తుందని, జ్వరం వస్తుందని వారించి వాళ్ళని యిళ్ళలోకి లాక్కుపోతారు. పెద్ద వాళ్ళయినా వర్షం వస్తే గొడుగు విప్పుతారు. చెట్టుకిందకు పరిగెడతారు.

చినుకు చినుకునూ ఆహ్వానిస్తూ చీకూ చింతను గాలికి వదిలేసి వర్షంలో తడుస్తూ వెళ్ళే కవి సుమనశ్రీ. వర్షానికి తన శరీరాన్ని వప్పగించే కవి ఆయన. ఆయనపై పూలవాన కురుస్తుంది. వర్షం అతన్ని కౌగిలించుకుంటుంది.

మార్మికుడి మనోగతం

రహస్యానికి ఆమోదం తెలిపినవాడి జీవితం రాగరంజితంగా వుంటుంది. తప్పుకుంటూ వెళ్ళిన వాడి బతుకు తపనతో నిండుతుంది.

'తప్పదు జీవికి వేదన, తప్పదు మనిషికి మృత్యువు

ఒక సకలాతీత శక్తి వున్నట్టా లేనట్టా? అని శ్రీశ్రీ విచిత్సలో పడ్డాడు. సుమనశ్రీ మాత్రం 'జీవితం రహస్యంగానే వుంటుంది' అని తీర్మానించి జీవితంలోకి ప్రవేశిస్తాడు. అభిప్రాయులతో, తాత్విక చర్చల్తో బుర్ర వేడెక్కించుకోడు. జీవితమిచ్చిన దానికి ఆమోదం తెలిపే నమ్రశీలి. ప్రకృతి తన అంతరంగాన్ని విప్పి రహస్యం మనకు విప్పి చెప్పదన్న విషయాన్ని అంగీకరించాలంటాడు.

'జీవితం రహస్యంగానే వుంటుంది

నీ చుట్టూ పహారా కాస్తున్న చెట్లు మాత్రం మౌనంగానే వుంటాయి.

ఎన్నో ఏండ్ల అనుభవాన్ని గడించినా, జీవన రహస్యాన్ని గమనించినా

నీకూ నాకూ ఏమీ చెప్పవు.

జడ పదార్థాలనుకునేవు కానే కావు

రోజుకో కొత్త ఆకు చిగురుస్తుంది, ఓ కొత్త పూవు పూస్తుంది

పూసిన పువ్వులోంచీ కాయ పొడుచుకొస్తుంది

కాయలోంచీ విత్తౌస్తుంది, విత్తు మళ్ళీ నేలలోకే పాకుతుంది.'

జీవితం ఈ ప్రపంచానికి చెందిందని, జనన మరణ ప్రక్రియ అనివార్యంగా అనంతంగా కొనసాగుతూనే వుంటుందని తెలుసుకున్నాడు. మౌనంగా వృక్షం తన పని తాను చేసుకుంటూ పోతోంది. పరిణామానికి తలవంచుతోంది. అలాగే మన జీవితాన్ని మనం అనుభవించాలి. మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి' అంటాడు. ఐనా ఈ జీవితంలోని అర్థరాహిత్యాన్ని చూసి కూడా ఆవేదన చెందుతాడు.

'నాల్గు రాళ్ళకోసం నక్కకీ కుక్కకీ నమస్కారాలెట్టడం

రెండక్షరాల రెండు క్షణాల ప్రేమకోసం

జీవితాన్ని ఈడుస్తూ బరువుల్ని మోయడం

ఏభై ఏళ్ళకే ముడుచుకు పోవటం, హరీ మనటం

ఎందుకో ఎంత గింజుకున్నా అర్థం కాదు'

ఎప్పుడో ఒంటరితనంతో మనసు అలసిపోయినపుడు ప్రతి మనిషీ పడే పరివేదనే యిది. నిజమే కదా! పై అధికార్లకు తలవంచాలి. ప్రేమ కోసం సమస్తాన్నీ సమర్పించాలి. యింతా చేస్తే యాభై ఏళ్ళకే జీవితం ముగిసిపోతుంది. యాభై దాటితే మనిషి ఎవరికీ అక్కర్లేదు. ఆదాయముండదు, అనురాగముండదు, కొన్నేళ్ళు గడిచాకా కన్నుమూయడం ఒక్కటే వుంటుంది. ఎందుకిదంతా? ఈ జీవితానికి అర్థమేమిటి? అన్న గంభీర తాత్విక చింతనకి క్షణకాలం కవి లోనవుతాడు. ఆ రహస్యం కోసం శాస్త్రవేత్తలు రాత్రింబవళ్ళు శ్రమిస్తున్నారు. తత్వవేత్తలు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు. మామూలు మనుషులు భక్తి మార్గాల్లో పరుగులు పెడుతున్నారు. ఎండమావుల్లో పడి ఎందరో వెళుతున్నారు. ఎందరు ఎన్ని మార్గాల్లో ప్రయత్నించినా, 'జీవితం రహస్యంగానే మిగిలి పోతుంది' అంటున్నాడు సుమనశ్రీ.

ప్రకృతి నిరంతర చలనం, రంగులు మారే రాగద్వేషాలు మనిషిని ఆలోచింప నివ్వవని, ప్రవాహంలో పడి కొట్టుకుపోయేలా చేస్తాయని కవి అంటున్నాడు.

'జీవితం మరీ రహస్యం అయిపోతోంది
తెరవెనక నిల్చుని తోలుబొమ్మలాడిస్తున్న
రహస్యాంగన అతి రహస్యంగానే వుండిపోతోంది'

సౌందర్య స్పర్శతో పులకించే సుమనశ్రీని ఎప్పుడో ఒక సందర్భంలో తాత్విక సుందరి తాకినట్లుంది. ఫలితం ఈ కవిత.

నేను కవిని !

'నేను కవిని నాకింకేం కావాలి?' అని సుమనశ్రీ ఒక కవిత రాశాడు. 'కవియై పుట్టుటకన్నను ఘనమేమున్నది జగతిన్' అన్నాడు రాయప్రోలు. ఆధ్యాత్మికవాదులు మరీ ఆధునికుల్లో జిడ్డు కృష్ణమూర్తిలాంటి వాళ్ళు సంగీతాన్ని, సాహిత్యాన్ని కూడా తిరస్కరించారు. ఓషో ఒక్కడే సంగీతాన్ని, సాహిత్యాన్ని తలకెత్తుకున్నాడు. కవుల్ని ప్రేమించాడు. కారణం సత్యాన్ని తమ సౌందర్య మార్గంలో అందుకునే వాళ్ళు కవులన్నాడాయన.

సుమనశ్రీకి కవిత్వం గొప్పతనం తెలుసు. సౌందర్యం తనకు సత్య సందర్శనం చేయిస్తుందని తెలుసు. కవిత్వమే తనకు నిత్య చైతన్యాన్ని, నిరంతర స్పృహని యిస్తుందని తెలుసు.

'నా గుండె గడియారం కొట్టుకొంటోంది
నా నరాల సంగీతం నే వినగల్గుతున్నాను

నా ఊపిరితిత్తుల ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని గమనించగల్గుతున్నాను
మంచంపై పడుకున్నా గుండెదీపం మెలకువగానే వుంది' అంటాడు.

తన శరీరంలో మనసులో కలిగే నిత్య సంచనాల్ని నిమ్మళంగా గమనిస్తున్నాడు. ఉచ్ఛ్వాస నిశ్వాసాల్ని గమనిస్తున్నాడు. పడుకున్నా వెలుగుతున్న గుండెదీపాన్ని గమనిస్తున్నాడు. హృదయ స్పందనే కవిత్వం. మేధోచర్య కాదు. స్పందన సంచలనాల్ని అనుసరించి సాగటమే కవిత్వం. ఆ చర్యలో నిర్నిద్రతో వున్నాడు. నిరంతర స్పృహతో వున్నాడు. కేవలం తన గురించి కాదు. తన ద్వారా సమస్త ప్రపంచాన్ని సందర్శిస్తున్నాడు.

'సమస్తాన్నీ నేను ఊపిరి పీలుస్తున్నాను
నా శరీరాన్ని నిరంతరం జ్వలించుకుంటూ
మనస్సును ప్రతిక్షణం మధించుకుంటూ
అంతరాంతర ఘోషల్ని వింటున్నాను
ఈ ప్రకృతిని జీర్ణించుకుంటున్నాను.

సమస్త ప్రపంచాన్ని సందర్శించగలుగుతున్నాడు. దానికోసం మనస్సును మధిస్తున్నాడు, అంతరాంతర ఘోషల్ని వింటున్నాడు. ఫలితంగా ప్రకృతిని జీర్ణించుకుంటున్నాడు. ఫలితంగా సమస్తమూ అతనికి అవగాహనకొస్తోంది. సత్య సందర్శనమవుతోంది. యిది కవితాజ్వాలలో దహించుకుపోయే కవికి తప్ప యితరులకు అవగాహన కాదు. అందుకనే అతనికి అంత ఆనందం.

అధికారం, ఆదాయం, కీర్తి ప్రతిష్ఠలు వీటితో కవికి సంబంధంలేదు. తన చైతన్యం సమస్తంతో సత్య సందర్శన చెయ్యగలగడమే అతని సంపద.

నా రక్తోష్ణోగ్రతనీ,
నా నరాల ప్రకంపనా వేగాన్నీ
నా ఆలోచనా ప్రవాహాల్నీ, నా గుండె ఘోషల్నీ
కవితలో చిత్రించుకో గలుగుతున్నాను
నా జాతి జనుల గుండెల్లో ప్రతిధ్వనిస్తున్నాను
కవిని నాకింకేం కావాలి?

మానవజాతి కోసం మనసారా తపించేవాడు కవి. తన ఆలోచనల్ని అందుకునే వాడికి మార్గం చూపేవాడు కవి. తన హృదయ స్పందనలకు అక్షరరూపాన్ని యివ్వగలిగేవాడు కవి. అట్లాంటి కవి సుమనశ్రీ. అందుకే ఆత్మవిశ్వాసంతో 'కవిని నాకింకేం కావాలి?' అంటున్నాడు.

పసివాడిలా పరితపించే కవి

మనం చూస్తూవుండగానే దృశ్యం మారిపోతుంది. పరిస్థితులు మారిపోతాయి. చిరునవ్వు నవ్వే పెదాలు అదృశ్యమయిపోతాయి. ఆత్మీయంగా చేసే ఆలింగనాలు కరువవుతాయి. ఎవరికివారు ఏవో స్థాయిల్ని ఆరోపించుకుని లేని సింహాసనాలెక్కి లేకిగా నవ్వుతారు. ఇది లోకంలో సహజం. కానీ సుకుమారుడయిన కవిని యిది బాధ పెడుతుంది. నిన్న ప్రేమగా పలకరించిన వ్యక్తి ఎందుకీరోజు యిలా మారిపోయాడని కవి అమాయకంగా ఆవేదనపడతాడు.

అంతా పెద్దవాళ్ళయిపోతున్నారు
లౌక్యం వెన్నపూస పెదాలకు పూసుకుంటున్నారు
ముద్దు ముద్దుగా జాలి జాలిగా మాట్లాడేవాళ్ళు
కరువైపోతున్నారు

రోడ్డెక్కి దొర్లుకుంటూ పోతున్నప్పుడు

కళ్ళెగరేసేవాళ్ళే తప్ప

గుండెలు తుడిమే వాళ్ళు మృగ్యమయిపోతున్నారు

...కన్నీళ్ళు తడిచేవాళ్ళు కనిపించకుండాపోతున్నారు

కవులు అమాయకులు. అమాయకత్వంలోంచి తప్ప కవిత్వం రాదు. నిష్కల్మషత్వంలోంచి తప్ప కవిత్వం రాదు. కవి ఎప్పటికీ పసివాడే. నిత్య బాల్యం అతన్ది. ప్రయోజనంతో సంబంధంలేని పలకరింపుల్ని అతను ఆశిస్తాడు. కానీ చూస్తూ వుండగానే మారిపోతున్న పరిస్థితుల్ని గమనించాడు. లౌక్యం పెదాలకు పూసుకున్నవాళ్ళని చూశాడు. ప్రేమగా పలకరించేవాళ్ళు అదృశ్యం కావడం గమనించాడు. గుండెలు తడిమి, కన్నీళ్ళు తుడిచే వాళ్ళు కనిపించకుండాపోవడం చూసి తల్లడిల్లాడు.

అలవిమీరిన లౌక్యాన్ని సుమనశ్రీ అసహ్యించుకుంటాడు. నటన చూసి ఆయనకు చిరాకు వేస్తుంది. సాహసంలేని, సౌందర్యంలేని జీవితాల్ని ఆయన వూహించలేడు. ఆయన కోరుకునేదల్లా ఒక చిరునవ్వు, పలకరింపు.

'నిన్నూ నన్నూ చల్లగా పల్కరించలేరు

ముళ్ళు గుచ్చుకుంటాయని జడిసి

గులాబీల్ని కూడా కోసుకోలేరు

పోలీసులకి భయపడి ప్రేయసిని కూడా కల్సుకోలేరు'

అందరూ బండబారిపోవడాన్ని చూస్తాడు. చల్లగా పలకరించలేనితనాన్ని అసహ్యించు కుంటాడు. ఏదయినా చెయ్యాలంటే కొంత సాహసం అవసరం. కష్టపడందే ఫలితం రాదు. ముళ్ళు గుచ్చుకోనిదే గులాబీ అందదు. ఎవరికో భయపడి ప్రేయసిని కలుసుకో లేనివాడు ఏం ప్రేమిస్తాడు.

ఈ విచికిత్సతో ప్రపంచాన్ని వింతగా చూస్తాడు సుమనశ్రీ–

అంతా పెద్దవాళ్ళయిపోతున్నారు

కనుగుడ్లు తెల్లబడి

మనసంతా విషంతో భయంతో నల్లబడి చల్లబడి

జర్రున జారిపోతున్నారు

శ్మశానాల వైపు తెలతెల్లగా వేగంగా

వేడిగా వాడిగా దూసుకుపోతున్నారు

పెద్దవాడు కావడమంటే చర్మం మందం కావడమే! జీవితాంతం లేత మనసుతో వున్నవాడే మనిషి కిందికి వస్తాడు. పువ్వులాంటి మనసున్న సుమనశ్రీ నిష్కారణంగా దూరమవుతున్న వాళ్ళని చూసి బాధపడతాడు. విషపూరితంగా మారి వెళ్ళిపోతున్న వాళ్ళని చూసి విహ్వలిస్తాడు. యింతకూ వాళ్ళంతా వెళుతున్నది 'శ్మశానాలవైపు', ఆ సంగతి తెలిసి వాళ్ళపట్ల జాలి ప్రకటిస్తాడు.

నిలదీసే కవి

నిర్మల గానంతో తన కవితాయాత్ర ప్రారంబించిన సుమనశ్రీ సహజంగానే యితర కవుల పట్ల ఆకర్షింపబడ్డాడు. సభలకు సమావేశాలకు వెళ్ళాడు. కానీ అతని వూహా ప్రపంచం తలకిందులయింది. అక్కడ సాహిత్య చర్చలకన్నా రాజకీయ రగడల్నే చూశాడు. గ్రూపులుగా ఏర్పడడం చూశాడు. ప్రయోజనాలతో నిండిన పరిచయాల్ని చూశాడు. సిద్ధాంతాలు, సాహిత్యం స్వార్థం వేసుకున్న ముసుగులని తెలిసి ఆశ్చర్య పడ్డాడు. ఆ గ్రూపులకు ఎవడో ఒక నాయకుడుంటాడు. అతని ప్రయోజనం, ఆశ్రితుల ప్రయోజనాల్ని నెరవేర్చడంలో అతను తలమునకలయి వుంటాడు. తనూ వాళ్ళనించీ ఏదో ప్రయోజనం ఆశించివుంటే సుమనశ్రీ మౌనంగా వుండిపోయేవాడు. కానీ ఆయన వూరుకోలేదు. అల్ప ప్రయోజనాల్ని ఆశించలేదు. వున్న విషయాన్ని బహిరంగపరిచాడు. పర్యవసానాల్ని పట్టించుకోలేదు. నిజాయితీలేని తనాన్ని నిలదీశాడు.

'కూలిపోతున్న మానవ సంబంధాల మధ్య
సిద్ధాంత చర్చల సిగపట్ల గోత్రాల మధ్య
పీలికలు పీలికలై పోతున్న పిచ్చి జెండాలుగా
పిచ్చి మొక్కల్లా పెరిగిపోతున్న యవ్వన వనాల్లా
ఎక్కడికోపోతూ ఏమీ తెలీని లోకాన్ని
ఊహించుకుంటున్న మూర్ఖ మేధావుల్లారా !

అని నిలదీశాడు.

సున్నితమయిన కవి, సౌందర్యారాధకుడు. సహజంగానే భావావేశం వున్న ఆదర్శాలున్న వ్యక్తుల వేపు వెళ్ళాడు. కానీ అక్కడంతా సిద్ధాంతాల చర్చ. ఎవరికి వాళ్ళు సొంత కుంపట్లు పెట్టుకుంటున్నారు. యవ్వనం పిచ్చి మొక్కలా దారి తెన్నూ లేకుండా పెరుగుతోంది. కవిత్వాన్ని కాసేపు పక్కనపెట్టి సుమశ్రీ కఠిన వాస్తవాల్ని చెప్పాడు.

'మీ జేబులు నిండి
మీ అల్ప ప్రయోజనాల్ని సాధించుకున్నాకా
మీ రాజకీయ జీవితాల సుస్థిరత కోసం
మూర్ఖ సహచరులతో ముఠాలు కట్టే మీరు
ఇంట్లో ఎట్లాంటి జీవితాల్ని గడుపుతారో మాకు తెలుసు
స్త్రీ స్వాతంత్ర్యాన్ని చాటి చెప్పే మీరు
మీ ఇంట్లో స్త్రీలపై చేసే అత్యాచారాలూ మాకు తెలుసు.

ఎదుటి మనిషికి చెప్పేటందుకు నీతులు వున్నాయి అన్నాడు ఎప్పుడో ఆత్రేయ. సమాజాన్ని వుద్ధరించాలనే సదుద్దేశాల్ని జనాలపై చల్లి వ్యక్తిగత జీవితాల్లో ఎంత స్వార్థ పూరితంగా వుంటారో సుమనశ్రీ చెబుతున్నాడు. అవన్నీ అల్ప ప్రయోజనాలు, రాజకీయ వునికి కోసం ఆడే నాటకాలు అంటున్నాడు.

సామ్యవాద సిద్ధాంతం ఈ దేశంలో ఎంత నిర్వీర్యమైందో, ఎర్రజెండా ఎన్ని ముక్కలైందో అందరికీ తెలుసు. ఆ ఆవేదనతోనే సుమనశ్రీ 'ఆవేశానికేమీ తక్కువ లేదు' అన్న ఈ కవిత రాశారు.

‘మీరు జండాల్ని పంచుకోవడంలో మునిగిపోయారు
జనాల్ని చీల్చుకుంటున్నారు
సోదర విప్లవవీరుల్నే శత్రువులుగా భ్రమపడుతున్నారు,
...విప్లవాల విడివిడి కాపురాల్ని
అభివృద్ధి సూచకంగా భ్రమపడి ప్రోత్సహించవద్దు’

అని దాదాపు పాతికేళ్ళ క్రితమే తన పరివేదనను వెలిబుచ్చాడు సుమనశ్రీ. ఒక సమన్వయం కోసం, సంఘటిత శక్తి కోసం సుమనశ్రీ తపించాడు.

పద్ధతిలేని ప్రకృతిని పరిశీలించే కవి

సుమనశ్రీ అన్నీ సవ్యంగా, సక్రమంగా సౌమనస్యంగా వుండాలని కోరుకునే కవి. అస్తవ్యస్త స్థితిని, అయోమయాన్ని, అరాచకాన్ని ఆయన ఇష్టపడడు. ఐనా తన యిష్టాయిష్టాలతో సంబంధంలేని యథార్థాన్ని యధాతథంగా చూస్తాడు. ప్రకృతిలో ప్రశాంతతే కాదు, ప్రళయాన్నీ దర్శిస్తాడు. జర్మన్ మహాకవి గొథె తన పసితనంలో లిస్బన్ నగరంలో వచ్చిన పెద్ద భూకంపం గురించి విని ‘దయామయుడయిన దేవుడు ఎందుకిట్లాంటి ప్రళయాల్ని సృష్టిస్తాడో, అని ఆశ్చర్యపోయాడట.

సుమనశ్రీ అన్నీ సక్రమంగా వుండాలనే ఆకాంక్షిస్తాడు –
పువ్వులు నిండైన పళ్ళవ్వాలని కలలు కనడం
మొక్క ఎదిగి మహావృక్షం కావాలని ఆకాంక్షించడం

కొండ మహా పర్వతం కావాలని ఉబలాట పడడం

సముద్రాల మీంచి లేచిన గాలి ఝంఝామారుతమై

తుఫానుల్ని వర్షించాలని తహతహలాడటం

ఆహ్లాదాన్నీ విషాదాన్నీ కల్గించే ప్రకృతిలో

సహజ సిద్ధంగా ఉబికి వచ్చే వాంఛలే!

పరిణామం ప్రకృతిలో అనివార్యం. అది అంతా మనకు అనుకూలంగా వుండాలని లేదు, ఆహ్లాదం కలిగించాలనీ లేదు, మనకు ఆమోదం కావాలనీ లేదు. మార్పు అనివార్యం. లేత మొక్క మహావృక్షమవుతుంది. పిల్లగాలి ప్రభంజనంగా పరివర్తన చెందుతుంది. తప్పదు. అందుకే ప్రకృతి ఆహ్లాదాన్నీ, విషాదాన్నీ కూడా కలిగిస్తుందని సుమనశ్రీ గ్రహించాడు. సత్యం ఆయనకు తెలుసు. మనిషి కాంక్షలని కూడా విస్మరించొద్దంటాడు.

'ప్రకృతిలోని ఏ వాంఛా విస్మరించ దగింది కాదు

ఏ కోరికా అవమానించదగింది కాదు

ఏ సహజమైన కళా ఎగతాళి చేయదగ్గది కాదు'

పైగా అవి మన యిష్టాయిష్టాలకు అనుగుణంగా జరిగేవి కావు. వాటిని నిషేధించలేం. అణచడానికి ప్రయత్నిస్తే ఫలితాలు దారుణంగా వుంటాయి. ప్రకృతి వైపరీత్యాల వెనక దాని ఆనందం దానిదేమో అంటాడు.

'వర్షించడం మబ్బుకు మహదానందకరమైతే

నినాదాల్ని చేస్తూ కొమ్మల్ని విరిచేస్తూ

కొండమీది బండల్నీ గోపురాల్నీ

దొర్లించడం గాలికి వినోదం' అంటాడు.

ప్రకృతి చర్యలో మనకు ఆదానందన్నిచ్చేవి కొన్ని. ఆహ్లాదాన్నిచ్చేవి కొన్ని. భయాన్ని కలిగించేవి కొన్ని. అక్కడ మన ప్రతి చర్యల ఫలితముండదు. ప్రకృతిని కొంత వరకే మనం అదుపుచేయగలం. పరిమితి దాటిన ప్రకృతి ప్రళయభీకరమైంది. అక్కడ మనం లొంగిపోతాం. అందుకే ప్రకృతిని చూసి ఆశ్చర్యంగా –

'అదుపు లేని కోరికలతో ఉబ్బిపోతున్న ఈ ప్రకృతి

ఏ అడవుల్లో తప్పిపోతోందో

ఏ తుఫానుల్లో కొట్టుకుపోతోందో

ఏ సముద్రాల్లోకి దొర్లిపోతోందో

ఏ ఎడారుల్లో ఏ ఒంటరి వొంటె

నీడల్లో ఇంకిపోతోందో' అంటూ విస్మయం ప్రకటిస్తాడు.

ఒక లేత మనసున్న పసివాడు కిటికీలోంచి అల్లకల్లోలమైన ప్రకృతిని చూసి ఆశ్చర్యం పొందుతున్నట్లుందీ కవిత. ఆలోచనాశీలి ఐన పసిహృదయమున్న కవి సుమనశ్రీ.

సంతృప్తి రహస్యం తెలిసిన కవి

అహంకారం లేని వాళ్ళకు జీవించడం తెలుస్తుంది. సంఘర్షించే వాళ్ళకి దుఃఖమే మిగుల్తుంది. నెమ్మదిగా వుండడం, ఆనందంగా వుండడం అందరికీ చేతకాదు. ఆ రహస్యం కొంతమందికే తెలుసు. ఆ తెలిసినవాళ్ళలో సుమనశ్రీ ఒకడు.

సుమనశ్రీ సంతోషించడానికి ఒక తెల్లటి మేఘ శకలం కంటబడినా చాలు. విహాయసంలో స్వేచ్ఛగా సాగే పక్షి కనిపించినా చాలు. వేల ఆకుల్తో విస్తరించిన ఒక వృక్షం కంటబడినా చాలు. వాటిని తన కవిత్వంతో అల్లుకుంటాడు.

చెట్టుక్రింది నీడలు అన్న ఒక కవిత రాశాడు. ఎంత హాయిగా వుందో చూడండి

కొమ్మలు కొమ్మల మీదికి వంగుతాయి
ప్రేమగా పువ్వుల నవ్వుల్ని రువ్వుతాయి

కొమ్మల కళ్ళ కింద నీడలు విశ్రమిస్తాయి

ఆ కొమ్మల కలయికలో ఆత్మీయతని చూస్తాడు. పువ్వుల నవ్వుల్లో ప్రేమని చూస్తాడు. నీడల్లో నిర్మల ప్రశాంతతని దర్శిస్తాడు. మనసు విశ్రాంతిపొందే మధుర ప్రదేశాలెన్నో ఆయనకు తెలుసు. వాటిల్లో చెట్టు కూడా వుంది. అందులో ఆయన జీవితాన్ని కూడా చూస్తాడు.

'అటూ ఇటూ అల్లుకున్న నీడల గజిబిజిలో
జీవితం ప్రతిఫలిస్తుంది
...ఊగే ప్రతి కొమ్మ నరాల్లో ఉత్సాహాన్ని ప్రజ్వలిస్తోంది
గాలి మరమరాల్ని భోంచేస్తోంది
కొమ్మ కోరికే పువ్వు – కోరిక ఫలించి పండవుతుంది
పండు పసుప్పచ్చగా నవ్వుతూ విందుకు ఆహ్వానిస్తూ వుంటుంది'

సాధారణమయిన, నిరాడంబరమయిన జీవితాన్ని యిష్టపడే కవి సుమనశ్రీ. అక్కడ అత్యాశలు, ఆర్భాటాలు అరాటాలూ వుండవు. పరిమితులు విధించుకున్న జీవితంలో భ్రమలుండవు. భ్రమలు లేని జీవితం హాయిగా వుంటుంది. ఆ జీవితం తెలిసిన వ్యక్తి ఎక్కడున్నా, ఎలాంటి పరిస్థితిలోనైనా స్వర్గాన్ని సృష్టించుకోగలడు.

'విశ్రాంతిలో నీడ నిద్రపోతోంది
నిద్రలో కొమ్మలపై కలలు కంటోంది
కలల్లో సూర్యుణ్ణీ గాలినీ మబ్బునీ ఉరుమునీ
మెరుపునీ చలిపిడుగునీ ఆహ్వానిస్తుంది.

విశ్రాంతిలో నీడ నిద్రపోతోందని ఎంత అద్భుతంగా అంటాడు! నీడ అంటే ఆయనకు ఇష్టం. అది చల్లదనానికి ఓదార్పుకు ప్రతీక. అక్కడ ఆత్మ విశ్రాంతి తీసుకుంటుందని ఆయనకు తెలుసు. నీడలో నిరాడంబరతని చూస్తాడు.

'నీడ కటిక నేలపై జీవిస్తూ
కొమ్మనో మబ్బునో చాటు చేసుకుంటుంది.
కాంతికి దూరంగా చీకటి కొమ్మల్లో కాపురముంటుంది
ఎండిపోయిన ఆకు క్రిందా, పడిపోయిన ఫలం క్రిందా
విరుగుతున్న కొమ్మ క్రిందా, నీడ తొంగిచూస్తూ వుంటుంది

నీడ మృత్యువు ప్రతిరూపంగా మనిషిలో ఎదుగుతూ వుంటుంది
కంటి వెలుగులో కరుగుతూ వుంటుంది'

అంటూ నీడలలో గోడలు కట్టి నిర్మల సౌధాన్ని నిర్మిస్తాడు. ఆనంద విషాదాలకతీతంగా నీడ వుంటుంది. దాన్ని మృత్యువని కూడా సుమనశ్రీ అంటాడు. మృత్యువును నీడకు ప్రతిరూపంగా చెప్పడంలో ఆయన ఒక తాత్విక స్పర్శను యివ్వడమే కాదు, మృత్యువు పట్ల మన భయాన్ని కూడా తేలిక పరిచాడు.

స్పర్శను ఆకాశానికెత్తిన కవి

స్పర్శకు రూపంలేదు. అది నైరూప్యం. కానీ స్పర్శకు అనుభూతి వుంది. మనసు ద్వారా మనం స్పర్శను అనుభూతి చెందుతాం. అట్లాంటి స్పర్శను బహుముఖాలుగా సుమనశ్రీ వర్ణిస్తాడు. ఆ స్పర్శకు హద్దులుండవు. మనిషి నించీ మహా విశ్వందాకా వ్యాపించిన ఆ స్పర్శని మనోహరంగా వర్ణించి మనల్ని దిగ్భ్రమకు లోను చేస్తాడు.

గాలి వీస్తుంది ఆకుల మృదుత్వాన్ని ఆస్వాదించాలని
మల్లె మొగ్గ బుగ్గల్ని చిదిమి పరిమళాల
ముగ్గుల్ని ప్రతి గుమ్మం ముందూ అలంకరించాలని
మంచు కురుస్తుంది
భూమి ఉష్ణోగ్రతను కొలుచుకుంటూ
కొండల్నీ కోనల్నీ కౌగిలించుకోవాలని

భూమి నరాల్ని నీటి బిందువులతో హత్తుకోవాలని.

'నేలతో నీడ అన్నది నను తాకరాదని' అంటూ కృష్ణశాస్త్రి గారు ఎప్పుడో ఒక పాట రాశాడు. స్త్రీ పురుష స్పర్శని వుద్దేశించి ఆ పాట. ప్రకృతిలో స్పర్శ ఎంత అనివార్యమో, ప్రకృతిలో ప్రత్యణువూ స్పర్శకోసం ఎంత పరితపిస్తుందో పరమాద్భుతంగా చెబుతారు సుమనశ్రీ. గాలి పూలని తాకడం, మంచి భూమిపై కురవడం వెనకవున్న అనుబంధాల్ని ఆహ్లాదంగా వివరిస్తారు. ప్రకృతితో జీవితంతో ఈ అపూర్వ కవికి గొప్ప సంబంధముంది. అనుబంధముంది. జీవితంలో వూహ తెలిసిన నాడే ఒక పరిపూర్ణతని అందుకున్న ప్రశాంత ఆనంద జీవి సుమనశ్రీ. యితర్లని మెప్పించడానికి, అభినందనల్ని అందుకోడానికి ఆయన కవిత్వం రాయలేదు. తన హృదయానందాన్ని ఆవిష్కరించడం కోసం కవిత్వం రాశాడని యిట్లాంటి కవితలు చెబుతాయి.

స్పర్శకు ఆయన ఒక రూపాన్ని యిస్తాడు –

ఆకుల పొత్తిళ్ళు తహతహలాడ్తాయి
సూర్య కిరణాల్ని ఎత్తుకుని ముద్దాడాలని
ఒక విచిత్రమైన అనుభవంగా స్పందిస్తాయి నరాలు

స్పర్శలో ఒక మాతృమమకారాన్ని మన కళ్ళముందుంచుతాడు. అనుభవాల్లో రకాలు కూడా వుంటాయి. స్పర్శల్లో తేడాలు కూడా వుంటాయి. గులాబీ కోస్తున్నప్పుడు కలిగే స్పర్శ భిన్నమైంది.

'గులాబీ పువ్వును కోస్తున్న నీకు
కొమ్మని కాస్తున్న మెత్తని ముళ్ళు
చటుక్కున చిమ్మిన రక్తం అనుభవంలోకి రావాలి'

సుకుమార స్పర్శకు ముందు కొంత బాధ కూడా అనుభవంలోకి వస్తుందంటాడు. స్పర్శని బహుముఖీనంగా వర్ణిస్తాడు. పతాకస్థాయికి తీసుకెళతాడు.

కొన్ని కవితలు చదవదగినవి వుంటాయి. కొన్ని మననం చేయదగినవి వుంటాయి. మరికొన్ని దాచుకోదగినవి వుంటాయి. సుమనశ్రీ సుందర భావుకతకి అద్దంపట్టిన మనోహర కవిత యిది. ఇది చదవదగిన, మననం చేయదగిన, దాచుకోదగిన కవిత.

స్పర్శ ఎత్తుల్ని చూపిస్తూ ఈ కవిత యిలా ముగుస్తుంది –

సున్నితమైన స్పర్శే
నీలో ఆనందపు లోతుల్ని సృష్టిస్తుంది
నీ ఊపిరిచెట్టు ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో
సుగంధ పరిమళాల్ని వెదజల్లుతుంది.

తన కవిత్వపు సుగంధ పరిమళంతో మనల్ని మైమరపిస్తాడు సుమనశ్రీ.

నేత్రం సుమనశ్రీ సంకేతం

దశాబ్దాల సాహిత్య కృషి అనంతరం సుమనశ్రీ ఒక నిశ్చయానికి వచ్చాడు. సాహిత్య సమావేశాలు, రాజకీయ సిద్ధాంతాలు యివన్నీ ఎండమావుల్లాంటివని తెలుసు కున్నాడు. ప్రశాంత అధ్యయనం, నిశితమయిన పరిశీలన, అభినందనలతో నిమిత్తం లేని కృషి అవసరమని గుర్తించాడు. తన శైలిని మరింత సాన పట్టాడు. తన తత్వానికి కావ్య నిర్మాణమన్నది సరయినదని తెలుసుకున్నాడు. ఒక తాత్విక స్థిరత్వం సంపాదించాడు. దీర్ఘ కవితా ప్రక్రియని అందుకున్నాడు. అమెరికన్, ఫ్రెంచి తదితర కవుల్ని అధ్యయనం చేశాడు.

రాబర్ట్ హాస్ 'లయ అన్నది విప్లవాత్మక పునాది కలిగింది. అక్కడ ఆ పునాదుల్లో యాంత్రికతకు సంబంధంలేని మౌలిక జీవన లక్షణముంటుంది... కొత్త కొత్త లయలు కొత్త కొత్త కాంతి రేఖలు, నూతన అవగాహనా కేంద్రాలు' అన్నాడు. సుమనశ్రీ అపూర్వమయిన లయను అందుకున్న కవి. సుమనశ్రీ కవిత్వ ఆవిష్కారమన్నది రీటాడోవ్ చెప్పినట్లు 'నేనొకచోట తిరుగుతుంటాను. అది నాకు పరిచితమైన ప్రదేశమో కాదో లేదో నేను చెప్పలేను. కానీ అది నన్ను ఉల్లాస, ఉద్రిక్త, ఉద్వేగాల్లో తేలేలా చేస్తూ వుంటుంది. నేను రాస్తున్న కొద్దీ నేనేమి చెప్పాలో నాకు తెలిసివస్తూ వుంటుంది' లాగా సుమనశ్రీ సాగే కొద్దీ జీవితం విచ్చుకుంటూ వుంటుంది.

కరోల్–అన్–డుఫీ అన్న స్కాంట్లాండ్ కవయిత్రిని ఎవరో 'మీరు పొడవైన వాక్యాలు రాస్తారు' అన్నారు. దాని కామె 'ఇట్లాంటి ప్రశ్న నన్ను అసహనానికి గురిచేస్తుంది. ఎందుకంటే నేనొక కవిత రాస్తున్నప్పుడు నేనే కాదు, ఏ కవయినా భాషేతరమయిన శబ్ద స్పృహతో వుంటాడు. అది సంగీతంకాదు, భాషకాదు ఆ రెంటికీ మధ్యన వుంటుంది' అంది. సుమనశ్రీ వాక్యాలు కూడా దీర్ఘంగా వుంటాయి, సంగీతభరితంగా వుంటాయి. భావబంధురంగా వుంటాయి.

నేను పదిహేనేళ్ళ క్రితం 'సార్! మీరు స్పష్టమయిన అస్పష్టకవి' అంటే ఆయన నవ్వేవాడు. రోబోసన్ అనే అమెరికన్ కవయిత్రి స్పష్టత గురించి చెబుతూ 'స్పష్టతకు కొన్ని సరిహద్దులున్నాయి. నా వుద్దేశంలో అవి శైలిని, వాక్యాన్ని, స్వరం యొక్క ఆరోహణ, అవరోహణల్ని మార్చడం' అంది. స్వరాన్ని శైలికి ఒదిగించడమన్నది సుమనశ్రీ సాహిత్య సంస్కారంలో భాగం.

సుమనశ్రీని రక్షించేది ప్రకృతి.

ఇలియట్ని, దిలాన్ థామస్ని, ఫ్రెంచి కవుల్ని ఇతర యూరోపియన్ కవుల్ని, పోస్ట్ మోడ్రన్ కవుల్ని సుమనశ్రీ గాఢంగా అధ్యయనం చేశాడు. తన రూపాన్ని మెరుగులు దిద్దుకున్నాడు. తన పరిధుల్ని తెలుసుకున్నాడు. పదాల్ని ఎట్లా ప్రయోగించాలో నేర్చుకున్నాడు.

సుమనశ్రీ తొందరపడడు, హడావుడి పడడు. ఏదో చేద్దామని, సాధించేద్దామని వురుకులు పెట్టడు. ప్రాచీనులు నిలుకడవలయు కృతికి అన్నారు. అట్లా నిలకడగా తన నిర్మాణ కృషిలో నిమగ్నమయి వుంటాడు. తన సంకేతంగా నేత్రాన్ని ఎన్నుకున్నాడు. తన దర్శనకు అదే పునాది.

ఛార్లెస్ ఓల్సన్ అనే ఒక అమెరికన్ కవి 'మేధోపూరితమయిన వంచనా శిల్పాలు, ఆలోచనా ధోరణులు సిద్ధాంతాలు వీటికి వీలయినంత దూరంగా వుండాలన్నాడు. ఇంకా శబ్దమాధుర్యం వున్నవాడు విశ్వవిజేత. శబ్దం చేతిలో వుంటే విశ్వం నీ చేతిలో వుంటుందన్నాడు. కళ ఒక్కటే జీవితానికి కవల' అన్నాడు.

సుమనశ్రీ వంచనా శిల్పాలకు, సిద్ధాంతాలకూ ఎప్పుడో దూరమయ్యాడు. ఆయన శబ్దం చేతిలో వున్నవాడు. విజయాలకు దూరంగా విశ్రాంతికి దగ్గరగా తన సృజన కొనసాగిస్తున్నవాడు.

దృశ్యం-1

సుమనశ్రీ తను తన కళ్ళతోబాటు రోడ్డు మీదకు వస్తాడు. చూస్తాడు. పూల దండ అల్లినట్లు అనుభూతుల్ని, దృశ్యాల్ని అల్లుతాడు. ఆ పూలదండలో అనుభవాలు, పరిమళాలు వుంటాయి. ఒక దాంట్లో ఒకటి అల్లుకుని వుంటాయి. అవిభాజ్యంగా వుంటాయి.

ఒకటో దృశ్యంలో కోటలు, కోవెలలు కనిపించాయి. అవి చరిత్ర చర్చించు కుంటున్నాయట. ఎక్కడినించో గోధుమరొట్టె వాసన గాలినించి పలకరించిందట. అంతలో ఎవరో టూరిస్టులు కనిపించారు. వాళ్ళకు స్మశానాలే యాత్రా స్థలాలయ్యాయట. అప్పుడు మన దేశ దౌర్భాగ్యాన్ని కవి వర్ణిస్తాడు.

'నా దేశం రోడ్లమీద నడిచేవి బ్రతికున్న శవాలు. అవి పుట్‌పాత్‌ల మీద విశ్రమిస్తాయి. నీడలో నిల్చుని నిట్టూర్పులు

విడుస్తాయి. గుండెల్నిండా గాలి పీల్చుకోడ మెలాగో తెలీక గుబులు ముఖాలు పెడతాయి. ముఖాల నిండా విషాద భాస్వరాల్ని ముద్దలు ముద్దలుగా చిమ్ముతూ వుంటాయి. ఐనా ఆశ మాత్రం చావదు.'

తను నడుస్తూ వుంటాడు. సాగుతూ వుంటాడు. కంటబడిన దృశ్యాల్ని ఆవిష్కరిస్తూ వుంటాడు. దేశ దరిద్రాన్ని దయనీయ స్థితిని ఫుట్‌పాత్ జీవితాల్ని కాసేపు ఆగి పరిశీలించాడు. అక్కడినించీ ముందుకు కదిలాడు. తన యాత్ర పరమార్థాన్ని చెబుతాడు.

ప్రతి ఇంటి గుహలోకీ ప్రతివీధి మలుపులోకీ ప్రతి సాయంత్రపు వంతెన కింద సముద్రాల్లోకీ, ప్రతిస్పందించే హృదయనదుల్లోకీ తొంగిచూస్తున్నాను. కళ్ళ బాణాల్ని రువ్వుతూ ప్రతి వీక్షణాల్ని నిశ్శబ్దంగా రికార్డు చేస్తున్నాను. బాధామయ దృశ్యాలకు బరువెక్కుతున్నాను'

తన పరిశీలనలో గొప్ప కవితాత్మకమయిన వ్యక్తీకరణలు చేస్తాడు. సాయంత్రపు వంతెన కింది సముద్రాలు, హృదయ నదులు వంటి పద చిత్రాల్తో ఆకట్టుకుంటాడు. ఆయనతోబాటు మన మనసులు కూడా బరువెక్కుతాయి.

టూరిస్టులు నిర్జీవమయిన ప్రతిమల్ని పరిశీలిస్తూ 'సంస్కృతి' అంటే అది అనుకుంటూ వుంటారు. వాళ్ళని వుద్దేశించి–

'అదృశ్య సౌందర్యాల్ని అస్పృశ్యంగా అన్వేషించేవాడా! అతి మనోహర
భంగిమలో
సుందరంగా కదులుతున్న ఆ అవయవాల అంతరంగాల్ని చూడు. రంగు
రంగుల ముఖాల్లో అంతులేని సౌందర్య స్వర్గాలు !
కనురెప్పల కదలికల్లో ఆవిష్కరింపబడుతున్న అద్భుత సూర్యోదయాలు
విచ్చుకుంటున్న ప్రతి పువ్వూ అనంత సువాసనల్ని ఝుళిపించే పచ్చబాకు!'

ప్రాణంలేని శిలల్ని, కోటల్ని కాదు, సమాధుల్ని కాదు. సజీవంగా కదిలే మానవ సమాజాన్ని చూడు. ప్రకృతిని చూడు. ప్రాణమక్కడుంది. సౌందర్యమక్కడుంది. అదే నీకు ఆనందాన్నిస్తుంది' అని యాత్రికుడితో చెబుతున్నాడు.

పువ్వులో నవ్వులో జీవన పరమార్థాన్ని చూసే సౌందర్య దార్శనికుడు సుమనశ్రీ.

దృశ్యం-2

ఒక దృశ్యం బాహ్య ప్రపంచాన్ని రూపు కడితే మరో దృశ్యం అంతరంగాన్ని చిత్రిస్తుంది. అది ఆత్మ నివేదన లాగా వుంటుంది. తోడుతో తన గోడును వెళ్ళబోసుకున్నట్లుంటుంది.

'అర్థంలేని బాధలో అస్పష్టంగా సంభాషించే నేను ఎల్లలు లేని ఈ ప్రపంచాన్ని నీ కళ్ళతో తప్ప మరే కళ్ళతో కొలవను? నీకు దూరమై బరువెక్కుతున్న ఈ గుండెపై ఎన్ని కన్నీళ్ళని కురవను? దూరం దూరంగా పోతున్న నిన్ను ఏ అయస్కాంత హస్తాలతో నావైపు లాక్కోను?'

ఆ దూరమవుతున్న వ్యక్తి ప్రియురాలే కావాలని లేదు. అసలు వ్యక్తి కావాలనీ లేదు. ఒక సమన్వయం కోసం కవి తపన అది. ఒక అవగాహన కోసం కవి ఆరాటమది. అంతర్ బహిర్ నిర్మలత్వం కోసం చేసే నిరీక్షణ అది.

'నన్ను గురించి నేనే చేసుకుంటున్న విఫల పరిశోధన
నేనెక్కణ్ణించీ వచ్చానో తెలీదు. ఎక్కడికి పోతున్నానో తెలీదు.

...ఎలా బ్రతుకుతున్నానో తెలీదు...ఎండిపోతున్న ఏరులా వుంది బ్రతుకు
ఎడారి ప్రయాణంలా వుంది ప్రతి పగలూ'
...నగరంలో వున్నా నేను నగరం నాగరికత నించీ వంటరితనాన్ని
ఆత్మకి అలంకరించుకున్న వాణ్ణి

ఎక్కడో ఏదో సందర్భంలో ప్రతి కవీ తన గురించి చెప్పుకుంటాడు. కవి తన ఆత్మ పరిశోధనలో పడ్డాడు. అందరితోబాటు పరిగెట్టలేదు. తన అస్తిత్వాన్ని పణంగా పెట్టలేదు వ్యక్తిత్వాన్ని కోల్పోలేదు. ఫలితం అంతర్మధనం. ఎటుచూసినా ఎక్కడా జీవితానికి అర్థం కనిపించలేదు. లక్షలమంది నివసించే నగరంలో వున్నా తను వంటరినని అంటున్నాడు. ఇంత తపించినా అవధిలేని అరాటం అనాగరికమని ఆయనకు తెలుసు. మళ్ళీ మెల్లగా తేరుకున్నాడు. మేలుకొన్నాడు.

'ఒంటరిగా వున్నా ప్రశాంతంగా వున్నాను
...నాకు నేనే శాంతిని ప్రకటించుకున్నాను
...కోపతాపాలకి నిప్పంటించుకున్నాను

సుమనశ్రీ విజయ రహస్యం అక్కడవుంది. ఆనందం బయట కాదు, అంతరంగంలో వుందన్న విషయం తెలుసుకున్నాడు. 'నాతో నేను శాంతి సంధి చేసుకున్నది మొదలు ఈ ప్రపంచంతో కూడా శాంతియుతంగా జీవిస్తున్నానన్నాడు' జర్మన్ గొథె. అట్లా తనతో తను అంగీకారానికి వచ్చిన సుమనశ్రీ ఆనంద ద్వారాల్ని అందుకున్నాడు.

'ఇప్పుడు నేను ఆమె రెండు కళ్ళ మధ్య
లంగరేసుకున్న పడవలా వున్నాను.
రెండు పక్షి రెక్కల మధ్య చిన్న చిన్న చేతుల మధ్య
...వినీలాకాశాల నేత్రాంచలాల మధ్య
విశ్వ రహస్యాల్ని గుప్పిట పట్టిన రెండు పాలరాతి భరిణల మధ్య
...నాకు నేనే స్వహస్తాలతో సంకెళ్ళు వేసుకున్నాను'

దృశ్యం-3

ప్రపంచాన్ని చూసి అలసిపోయిన చూపులు ప్రకృతిని చూసి ఓదార్పు పొందు తాయి. నిర్దయ నిండిన లోకంతో సుకుమారుడయిన సుమనశ్రీ చాలాసార్లు అలసి పోతాడు.

'నిర్మమతా నిర్మానుష్య సామ్రాజ్య వ్యవస్థలో పర్వతాల మీద ఊగిసలాడుతూ భూమి పట్టు కోల్పోతున్న మహావృక్షంలా మరణాన్ని కౌగిలించుకుంటున్న మానవ మస్తిష్కపు అశక్తత'ను ఆయన చూశాడు.

సున్నితమయిన వ్యక్తికి యివి భరించలేని అనుభవాలు. అలసిపోయేలా చేస్తాయి. తన ఆనంద పార్శ్వానికి వుపసంహ రించుకుంటాడు. తనకు ఒక తన్మయత్వాన్ని అందించే నీడనిచ్చే రంగం వుంది. ఆమె తనకు ఓదార్పునిస్తుంది. ఆమె కళ్ళు తనకు చాలు.

'కళ్ళతోనూ, ఊపిరితోనూ సంభాషించుకుంటున్నాం
నిశ్శబ్దమే శక్తి సంజనితం మౌనంగా మనం మాటలకందని అనుభూతిని
జుర్రుకుంటున్నాం. నేత్ర ఖడ్గాలతో ఒకర్నొకరం సున్నితంగా పొడుచుకుంటున్నాం'

దృశ్యం మారిపోయింది. దుస్సహ ప్రపంచం నించీ దూరంగా జరిగాడు. విశ్వానికి, విశ్వాసానికి ప్రాతినిధ్యం వహించే నేత్రాల ముందు కూర్చున్నాడు. మౌనాన్ని కప్పుకున్నాడు. మందహాసాన్ని విప్పుకున్నాడు. దానికి తగినట్లున్న ప్రకృతిని ప్రదర్శించాడు.

'పచ్చగా కిటికీలోంచి చల్లగాలి కబుర్లాడుతోంది. చెట్లలోకీ, చేలలో చింపిరి
చింపిరి చింతచెట్ల గుబురులోకీ
కొబ్బరి చెట్ల తెల్లని పలువరుసలోకీ సరస్సులో బారులు తీరిన తెల్ల కొంగల
పొడవాటి ముక్కుల్లోకీ'

చల్లటి ప్రేమ నిండిన చూపులు. అతడు, ఆమె. అనురాగ పరిమళం, స్వర్గపు అంచుల స్పర్శ. కబుర్లాడే పిల్లగాలి, మల్లెల పరిమళం, మనోహరమయిన దృశ్యం. అంతే! కాలం ఆగిపోయింది. గంటలు క్షణాల్లో గడిచిపోయాయి. భవభూతి 'రాత్రి రేవ వ్యరం సీత్' అన్నాడు. రాత్రి ఎప్పుడు వచ్చిందో ఎప్పుడు వెళ్ళిందో తెలీదు.

అందుకే సుమనశ్రీ మళ్ళీ పసివాడుగా మారిపోతాడు. ప్రపంచ అనుభవాలతో బండ బారడం ఆయనకు యిష్టముండదు, ఆయన చేతకాదు.

'ప్రకృతి నన్ను ప్రతిరోజూ బ్రతికిస్తుంది
చుక్కల్నీ చంద్రుణ్ణీ చూసుకుంటూ అదృశ్య ప్రేయసితో షికార్లు
చేస్తుంటాను నీ తోటలో
ఉదయాన్నే విరిసే
సూర్యోదయాన్ని ఎర్రగులాబీలా ఆఘ్రాణిస్తాను

ఉదయాస్తమయాల్ని నమ్ముకున్నవాడు. ప్రకృతిపట్ల అపార విశ్వాసమున్నవాడు సుమనశ్రీ. లోకం తనపట్ల నిర్దయగా ప్రవర్తించినా ప్రకృతి తనని తల్లిలా దగ్గరకు తీసుకుంటుందన్న నమ్మకం ఆయనకుంది. చుక్కలు, చంద్రుడు, సూర్యోదయం, సూర్యాస్తమయం, వీటిలో తన ఆనందాన్ని చూసుకుంటాడు. వాటిలోని నిత్య నవ్యతని తన కవితల్లో కలుపుతాడు. అందుకనే 'మన విప్లవ గీతికల్ని మనమే సృష్టించుకుంటాం నిర్బంధాల్నించి రక్షించుకుంటాం' అని తీర్మానిస్తాడు. ఆత్మ విప్లవంలో విజయం సాధించిన కవి సుమనశ్రీ.

దృశ్యం-4

కవిత్వం స్వచ్ఛంగా ఏ రాజకీయాల దుమ్మూ ధూళీ అంటకుండా వుండాలని సుమనశ్రీ కోరుకుంటాడు. దృశ్యాల్ని సంఘటనల్ని ఆయన రికార్డు చేస్తాడు. కృత్రిమ అందాల్ని వూహించుకోడానికి ఇష్టపడడు. రోడ్లపై మనిషికి మనసిస్తాడు, మానవ మేధస్సు, సృష్టించే అద్భుతాలకి పరవశిస్తాడు.

సుమనశ్రీ శైలి సుందరమైనది. ఆయన శైలి ఊపిరాడనివ్వని వర్షంలాంటిది కాదు. చుట్టుముట్టిన అగ్నిజ్వాల కాదు. ఎక్కడా ఎవర్నీ యిబ్బందిపెట్టని, నిర్బంధించని నిర్మల ప్రవాహం లాంటిది. మంచిపొగలాంటిది, మల్లెల పరిమళం లాంటిది. పిల్లగాలి చల్లదనంలాంటిది.

శైలి వ్యక్తిత్వాన్ని పట్టిస్తుంది. కవి వంచకుడయ్యేదీ, నిజాయితీపరుడయ్యేదీ, తెలివైన వాడయ్యేదీ, తెలిసీ తెలీని

వాదయ్యేదీ, వాడి తత్వమెలాంటిదైనా శైలి పట్టిస్తుంది. కృత్రిమ విన్యాసాలతో పాఠకుణ్ణి వంచించి, భ్రమింపజేయాలని అతి తెలివితో కవి ప్రయత్నించినా ఎక్కడి నించో 'పొగ' మొదలవుతుంది.

సుమనశ్రీ గారికి సందేహాలుండవచ్చు, సంశయాలుండవచ్చు, వాటిని కప్పి పుచ్చి ఎన్నడూ ఆయన నటించడానికి ప్రయత్నించలేదు. తన కవితల్లో తన వినమ్రతనీ, ఔదార్యాన్నీ, సహృదయతనీ మీగడ తరగల్లాంటి వాక్యాలతో మనముందు నిష్కపటంగా ప్రదర్శిస్తాడు.

'ఎక్కడికి పోవాలీ సాయంత్రం వేళ,
ఏ గుహలో తలదాచుకోవాలి!
నన్నీడ్చు కెళుతున్న రైలు పట్టాల మీంచి పరుగెట్టడంలేదు
అలసిన నా మందాకినితో చేతులెత్తి పిలుస్తోన్న
ప్రకృతిలో లీనమైపోవాలని ప్రయత్నిస్తోంది'

చాలా సాదాసీదాగా సాఫీగా కవిత్వ స్పృహతోనే సాగుతుంది కవిత.

'అవునలానే వుంటాయ్ పరిస్థితులు
నువ్వూ నేనూ లెక్కుండదు
మనమెక్కి తొక్కిన మంచాలూ
చూసి చూసి విసుగెత్తిన దూరదర్శిని దుర్భిణీ యంత్రాలు
రాసి పడేసిన ఆత్మకథా సరిత్ సాగరాలూ
వాసన చూసి పడేసిన మల్లెపూల మదనకామరాజు కథలూ...'

ఎక్కడా ఆగదు. మెల్ల మెల్లగా శైలి వేగాన్ని పుంజుకుంటుంది. అనంతమైన మైలురాళ్ళు అనుభూతి రోడ్డుపై సాగిపోతాయి. వస్తువుకి అనుగుణంగా, స్పందనలకి అనుకూలంగా ఎత్తుగడల్లో, కొనసాగింపుల్లో, ముగింపుల్లో విభిన్న చలనముంటుంది.

సంక్లిష్టంగా కవిత మొదలై సహజ సరళంగా ముగుస్తుంది. వ్యక్తిగత అనుభూతుల్నించి మొదలై సామాజిక చింతనలోకి పరవశింపజేస్తాడు.

సుమనశ్రీ గారివన్నీ చిన్ని చిన్ని ప్రపంచాలు. ఆ ప్రపంచాల అందచందాలకు ఆయన పులకరిస్తాడు. అదే సమయంలో మండుతున్న భూగోళంలో మమైకం చెందాలనుకుంటాడు.

కుటుంబం, కవులు, స్నేహితులు, మనుషులు, గతం, వర్తమానం, భవిష్యత్తు సిద్ధాంతం, శిల్పం, కవిత్వం అన్నీ ఆయన్ని ఒక్కసారిగా చుట్టుముడతాయి వాటన్నిటితో ఆయన వుద్రేకపడకుండా చర్చిస్తాడు. ప్రతిదాన్నీ సమాధానపరచాలని ప్రయత్నిస్తాడు. సమన్వయపరచాలని ఆరాటపడతాడు.

ఉద్యోగరీత్యా మంచుగడ్డకట్టే దేశాల్లో వుండి అక్కడి అనుభవాన్ని కళ్ళకు కట్టినట్టు వర్ణించాడు.

'ఈ శీతల దేశంలో చల్లగాలి నా చెవిలో సముద్రాల్ని తోడిపోస్తోంది. నా పంచ ప్రాణాలూ మంచుముక్కల్లా గట్టిపడుతూ కరిగిపోతూ రోడ్లపై దొర్లుతున్నాయి. నిశ్శబ్దం నన్ను నింగికెగరేస్తోంది. ఆకులు మరణిస్తూ నన్ను శపించిపోయాయి. ఇప్పుడు ఇక్కడ నేనొక యుద్ధంలో చిక్కుపడ్డ వెర్రి సిపాయిని. ఈ నగరం నాగరికత నాలో ఒంటరి తనాన్ని పెంచిపోషిస్తోంది. పక్కింటివాని వూపిరి నాకు తగలకుండా నన్ను పరిపాలిస్తోంది.

సుమనశ్రీ గారు సున్నితమైన కవి. మనకున్న సుకుమార భావుకుల్లో ఆయన ఒకరు. 'చిలిపి వలపు కోసం, చింత చిగురుకోసం, నలువైపులా వెతికే కవి. వేసవి ఎండలో గ్లాసుడు చల్లని మంచి నీళ్ళకే మైమరచే కవి. ప్రకృతి చిలకరించే మంచు బిందువు తాకిడికే పులకరించే కవి.

ఎప్పుడూ తెల్లని మల్లెపువ్వునే ముద్దాడాలనుకుంటాడు. కలల కలకండ ముక్కలంటే ఇష్టం. అట్లా అని వాస్తవాల వడగండ్లనీ వదులుకోడు. నీటి మీద నూనె బిందువులా సమాజం మీద వాలి తన వర్ణ సంగీతంతో వ్యాపిస్తాడు. ఆయనకు కవిత్వ మంటే ప్రాణం. మనుషులంటే మమకారం. చలనంపట్ల, పరిణామంపట్ల ఆయన కేర్పడుతున్న నమ్మకంవల్ల కవిత్వం కనీసం కవులకన్నా అర్థంకావాలన్న స్పృహని ప్రకటిస్తాడు.

నైరూప్య వ్యక్తీకరణ పట్ల కూడా సుమనశ్రీ గారికి అభిమానం వుంది. చిత్ర విచిత్రమైన ఆకర్షణల మెరుపులు చిమ్మటం పట్ల ఆయనకు ఆసక్తి.

'నిశ్శబ్ద కవిత్వం నీటిమీద కొట్టుకొస్తోంది. నీళ్ళమోత నాలో దప్పిక బాహువుల్ని చాస్తోంది. కొత్త కవిత్వం అస్తిపంజరాలకు రంగులేస్తోంది. శిల్ప సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ ఎండిపోతున్న నదుల్తో గంతులేస్తోంది'.

అంటూ కృత్రిమ కవిత్వాన్ని విమర్శిస్తారు.

సుమనశ్రీ కవితలో నిజాయితీ వుంది. స్పష్టత వుంది. జీవితం వుంటుంది. జీవితంలో బాధలుంటాయి, ఆనందాలుంటాయి. వాటిని బట్టే భవిష్యత్తు స్పష్టాస్పష్టంగా కనిపిస్తుంది. కవి ప్రాథమికంగా ఆశాజీవి. ఐతే ఎన్ని అవాంతరాలొచ్చినా సాగుతున్న సమాజ ప్రవాహానికి వినమ్రుడవుతాడు.

'నలుగురిలో వున్నా నాకు నేనుగా నగరం నాగరికతని కౌగిలించుకుని వంటరి తనాన్ని ఆప్యాయంగా కౌగిలించుకున్నవాణ్ణని, తన ఏకాంత జీవితం గురించి చెప్పుకున్నాడు.

'శతాబ్దాల అశ్రు సముద్ర గర్భాల్నించీ పెల్లుబికే అస్తవ్యస్త చరిత్ర' గురించి తెలుసుకోవాలని తపిస్తాడు.

'సంకీర్ణమయ్యే సంకేతాల్ని వదిలించుకోవడం, ప్రత్యక్ష న్యాయస్థానాలు పట్టపగలే నిర్దోషుల్ని వురి తియ్యడం, అరాచకం అందలమెక్కడం' దర్శించే కవి సుకుమార సుమంలా సంచలిస్తాడు.

ఆయన వాక్యాలు తీగలు, తీగలుగా సాగి గుబురు గుబురుగా మనల్ని అల్లుకుంటాయి. ఎక్కడా అంతులేని అవేశం, కట్టలు తెంచుకున్న ఉద్రేకం ఆయన కవితలో వుండదు. సెలయేటి గలగలలు, నిర్మలాకాశంలో నక్షత్రాలు ఆయన కవితలు.

దృశ్యం-5

ఒక ఆమోదానికి, ఒక అంగీకారానికి ప్రతి మనిషీ రావాలి. ఒక దగ్గర ఆగాలి. అప్పుడు అన్నీ స్పష్టమవుతాయి. చల్లబడతాయి. తను కవినని, తన వూపిరి కవిత్వమని గుర్తించాక, తెలుసుకున్నాక ఒక నిశ్చింత అతన్లో అడుగుపెట్టింది. ఆత్మ విశ్వాసం కలిగింది.

'జీవితమే కవిత్వ మైనప్పుడు

నా ప్రతి అనుభవమూ పదమై పద్యమై అనుభవసారం కలయై

భవిష్యదాకాశమై గుండెగులాబీ పువ్వై ప్రకృతి చిల్కరించే

మంచు బిందువుల మధ్య పుల్కరింపై

నా నిర్మల అంతరంగం ఉప్పొంగిపొరలే సముద్ర

కెరటమై

కాలం కాచి వడపోసి అందిస్తున్న తేనేటి విందై పల్లవిస్తూ ప్రవహిస్తోంది'

సుమనశ్రీ భావుకత స్వచ్ఛమైంది. సజలజలంలాంటి స్వచ్ఛ స్ఫటికంలాంటిది. అందాన్ని వడగట్టిన ఆనందసారమది. ఆయన్ది నిర్మల అంతరంగం. అంతులేని ఉద్వేగాల్లోపడి కొట్టుకుపోడు. ఆహ్లాద పరిమళం లాంటివాడు. ఆయన అగ్ని కెరటం కాడు. వెన్నెల తెరలాంటివాడు. పిల్లగాలికి కదిలే వెన్నెల తెరలాంటివాడు. కుసుమ కోమలుడు. చిగురుటాకు లాంటివాడు. కఠిన ప్రపంచానికి కావాలనే దూరంగా వున్న వాడు. ప్రేమగా పలకరిస్తే దగ్గర చేరుతాడు. అందుబాటులోనే వుంటాడు కానీ అందరి వాడే కానీ కొందరికే అర్థమయ్యే కవి. కారణం దేశాల్ని ప్రజల్ని ఉద్ధరిస్తానని ఆయన ఫోజులు కొట్టడు. శిష్యుల్ని తయారు చేసుకోడు. గురువుగా మారాలనుకోడు.

సుమనశ్రీ స్వాప్నికుడు. కవిత్వం ప్రేయసిలా బాధపెడుతుంది –

'అందమైన పక్షిలా హఠాత్తుగా నా భుజాలపై వాలి క్షణాల్లో వెకిలి నవ్వులు
నవ్వుతూ వెళ్ళిపోవడం తన కలవాటే కావచ్చు. స్వప్న సంగీతం కోసం
నిరీక్షిస్తూ ఎడారి బండరాళ్ళ మధ్య ఇరుక్కుపోవడం, గిలగిల్లాడ్డం నాకొక్కడికే
తెలుసు

కవిత్వ చరణాల కోసం ఆకలి గుహల అంతరంగాల్ని వెతకడం మొదలు పెట్టాను

బురద బురదగా మురికి మురికిగా జాలువారింది దరిద్రం'

కవిత్వం తనని కవ్విస్తుందంటాడు. నిత్యం తనతోనే వుంటుందనుకుంటే ఎక్కడికో వెళ్ళిపోతుందది. ఎప్పుడో వస్తుంది. దానికోసం తపిస్తాడు. అది మనసులో వుందని వెతకడం మొదలుపెడితే దరిద్రం మురికి మురికిగా జాలువారిందట!

ప్రకృతి పారవశ్యం, సౌందర్యలాలస నిండిన సుమనశ్రీ యితరుల్లాగా ఉత్తేజ గీతాలు, ఉద్రేక కవితలు రాయలేదు. రెచ్చగొట్టే ఉపన్యాసాలివ్వలేదు. కవిత్వాన్ని నినాదాలతో నింపలేదు. పేదలపట్ల బాధలపట్ల సానుభూతి లేక కాదు. సాహిత్యమంతా సంఘ సంస్కారమే 'చీడ'లా పట్టుకోడం చూసి చిరాకు పడతాడు. గొప్ప సందిగ్ధంలో పడతాడు. ఆలోచనలో పడతాడు.

'కవిని సమాజం వెలివేసిందో కవే సమాజాన్ని బహిష్కరించాడో
నాకైతే తెలీదు. ఏకాంత నిశ్శబ్దమే కవికి అంతఃపురమైంది. శిలా సదృశమే
జీవితాదర్శమైంది.'

సమాజంలో కవి పరిస్థితి ఏమిటి? అతను సౌందర్యాన్ని ఆవిష్కరించేవాడా? సామాజిక కార్యకర్తా? సిద్ధాంకర్తా? కవి సమాజాన్ని బహిష్కరించాడా? సమాజం కవిని బహిష్కరించిందా?' అన్న విచికిత్సకు లోనవుతాడు. కానీ తన ప్రాణం కవిత్వం కోసం అల్లాడుతుందని ఆయనకు తెలుసు.

అందుకే 'రెండే రెండు కవితా వాక్య శకలాల కోసం ఆకాశం మీది చుక్కల్ని మొత్తం చీకట్లో వడబోస్తున్నాను' అంటాడు.

దృశ్యం-6

కవులు సున్నితమయిన వాళ్ళు. వాళ్ళని బాధపెట్టడం సులభం. ఏదో ఒక సందర్భంలో ప్రతి కవీ యింకో కవిని కలుస్తాడు. సాహిత్య సమావేశాలకు వెళతాడు. అట్లాగే సుమనశ్రీ కవుల్ని కలిసేవాడు. అభిప్రాయాల్ని యిచ్చిపుచ్చుకోడానికి సమావేశాలకి వెళ్ళేవాడు. ఆ సందర్భాల్లో ఆయన మనసు గాయపడింది. కారణం ఆయన బలమైన వ్యక్తిత్వమున్నవాడు. తన మార్గం తనకుంది. ఎవరికీ తలవంచడు. ఎవడో ఎప్పుడో యీయన ఫలానా కవికి అనుయాయి అని వుంటాడు. దాంతో ఆయన మనసు గాయపడింది.

'కొద్ది కొద్దిగా సూర్యరశ్మిని ఏరుకుంటూ అనుభవాల్ని తవ్వుకుంటున్నాను

నాలో కన్నీరింకిపోయింది. కవిత్వం కరిగిపోయింది

ఏ కవిని కలుద్దామని వెళ్ళినా వాడి జేబులో మనిషిననుకుంటాడు

ఏ పుస్తకం చదువుతామని కొన్నా కాపీ కవితల ఖజానాలే!'

మనసు గాయపడితే ఆర్ద్రత తప్పుకొంటుంది. ఆవేదన మిగుల్తుంది. కలుసుకోడానికి వెళ్ళినంతమాత్రాన స్నేహధర్మాన్ని పక్కనబెట్టి అతను యీ కవిని తన జోడిలో మనిషనుకుంటే ఎలా వుంటుంది? ఛీ! ఎందుకు కలిశాను వీడిని! అనిపిస్తుంది. సుకుమార ప్రపంచంలో అనురాగం, ఆత్మీయతలు మాత్రమే వుండాలని ఆశించే కవికి ఈ అనుభవం ఆశనిపాతం లాంటిది. అందుకే అందర్లో చిరునవ్వు నవ్వుతూ పలకరించే సుమనశ్రీ కొంత కాలంగా ఏకాంతాన్ని మాత్రమే నమ్ముకున్నారు. తన ఏకాంత ప్రపంచంలో ఆయన తన ఆలోచనలకి పదును పెట్టుకున్నాడు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకున్నాడు.

'మీరాదరించినా ఆదరించకున్నా నా కవిత్వం ఒక దిగులెరుగని ప్రవాహం,

నాలోంచి మీవైపు ఉద్ధృతంగా పెల్లుబికే ఒక మహాద్భుత జలపాతం

...కవిత్వం నన్నావహించినప్పుడు నేనొక అహంభావిగా మారిపోతాను

గొంతులోకి దూకే బంగారు మణుల్ని చూసి మీకంటే ముందుగా

నాకు నేనే ఆశ్చర్యపోతాను'

తను సత్యాన్ని నమ్ముకున్నానని, సౌందర్యాన్ని నమ్ముకున్నానని అరకొర కవుల అభినందనలకు తన కవిత్వం పరిమితమైంది కాదని, ఔనన్నా కాదన్నా అది కవుల్ని కూడా కదిలిస్తుందని నమ్మకంతో చెబుతున్నాడు సుమనశ్రీ. తనలో వచ్చిన పరిణామం, ప్రతిభావికాసం చూసి తనే ఆశ్చర్యపోతున్నాడు.

కవిత్వాన్ని ఆత్మీయులతో పంచుకోవాలని ఆయన ఆరాటం.

ఎవరితోనో ఒకర్తో హాయిగా ముచ్చటిస్తే తప్ప నాయీ ఆకలి తీరదు

కదుల్తున్న బస్సుల్లోనే నా హృదయం కవితల్ని ప్రసవిస్తోంది

శబ్ద చిత్రాలు అదృశ్యదృశ్య చిత్రాలు నా ముందొక అద్భుత ఇంద్రజాలాన్ని ప్రదర్శిస్తాయి

విచిత్ర స్వప్నాలు నా కవితా వాక్య ప్రవాహాల్లో

అప్సరసల్ని ఆవిష్కరిస్తాయి

అక్షర కన్యల్ని నా కౌగిట్లో కట్టి పడేస్తాయి'

దృశ్యపరంపరలు సుమనశ్రీని తీగల్లా అల్లుకుంటాయి. అక్షర కన్యలు ఆయన్ని ఆలింగనం చేసుకుంటాయి. ఈ పరవశం, ఈ ఆనందం యితరుల్తో పంచుకున్నప్పుడే పదింతలవుతుంది. అదీ తన కవిత్వాన్ని అర్థంచేసుకునేవాళ్ళయితే ఆ ఆనందానికి అవధులుండవు. తన చిరంతన చింతనని. అనంత కవిత్వారాధనని, అనుభూతుల ఆవిష్కారాల్ని సహృదయులు అర్థం చేసుకోవాలని ఆశించే కవి సుమనశ్రీ.

దృశ్యం-7

నిర్మల నిశ్శబ్దంలో వుంటూ కూడా ఎదురుచూపులు చూస్తాడు కవి. తన కోసం ఎవరో ఎక్కడో ఎదురు చూస్తున్నారని తపిస్తాడు. భావకుడి తత్వం అలాంటిది. తపించడంలోనే తన్మయముంది. శరీరం, ఆత్మ, ప్రపంచం, ప్రకృతీ అన్నీ సమాంతరంగా ఎప్పటికీ కలవలేని స్థితిలో వుంటాయి. ఒకదాన్నొకటి ఆకర్షిస్తూనే వుంటాయి. వీటన్నిటి సమాహారమయిన కవి అనునిత్యం స్పందిస్తూ వుంటాడు.

'ఎవరో నా కోసం పచ్చిక బయళ్ళలో ఎదురు చూస్తున్నారన్న భ్రమ

ఎక్కడ ప్రకృతి సౌఖ్యం అంతమవుతుందో అక్కడ జీవితం పుష్పించడం మానేస్తుంది

స్వార్థం నన్నావహించినప్పుడు నాకు చలిజ్వరమొస్తుంది

అహంకారం నన్నాక్రమించుకున్నప్పుడు ఆత్మహత్య ఉత్తమమనిపిస్తుంది' ప్రకృతికీ జీవితానికి మధ్యనున్న సంబంధం తెలిసిన కవి సుమనశ్రీ. ప్రకృతిని కాదంటే మన వునికి ప్రశ్నార్థకమవుతుంది. పరివేదనే ఫలితమవుతుంది. జీవితం వాడిపోతుంది. ప్రకృతితో సన్నిహితంగా వున్న మనిషి ఎప్పటికీ స్వార్థపరుడుగా వుండలేడు. అహంకారిగా వుండలేడు. అవి తనని అంటినప్పుడు సుమనశ్రీ సంచలించిపోతాడు. ప్రాణమంతా పచ్చదనాన్ని పరచుకున్న సుమనశ్రీ ప్రకృతి కవి.

తను ఎట్లాంటి కవినో ఆయన చెప్పుకున్నాడు. వాక్య చమత్కారం తనకు యిష్టముంటున్నాడు.

'వాక్య చమత్కారమే నా కళ, వక్రోక్తి ఈనాటి నా అలంకారం
కలల అలలతో నేనల్లిన వలల్ని నల్దిశలా వెదజల్లుతున్నాను
పద చిత్రాల చేపల్ని వొడుపుగా పట్టడం నేర్చుకున్నాను
నేనీనాటి అత్యాధునిక కవిని, అందరూ బంగారం ఏరుకుంటూంటే
నేను మాత్రం పగిలిన గాజు పెంకుల్లో ప్రతిఫలిస్తున్న నూత్న సంకేతాల్ని
అన్వేషిస్తున్నాను' అంటాడు.

సుమనశ్రీ ఆధునికుడు. అత్యాధునికుడు. అలవిమీరిన వుద్వేగాల్ని యిష్టపడనివాడు. పదచిత్రాల్లోకి ప్రపంచాన్ని వొంపేవాడు. అక్షరాల పూలని అందరిపై చల్లేవాడు. ప్రయోజనాల్ని కాక నూత్న సంకేతాల్ని చూసి పరవశించేవాడు. సుమనశ్రీకి కవులంటే యిష్టం. సౌందర్యంతో సాహచర్యం చేసే సున్నిత కవి. ప్రపంచ కవిత్వ పరిమళాన్ని ఆఘ్రాణించాలని ఆయన ఆకాంక్ష. ఈ క్రమంలో ఒంటరితనం కూడా కొన్నిసార్లు బాధపెడుతుంది. అర్థం చేసుకోలేనితనం ఆవేదనకు గురిచేస్తుంది. ఒక సంక్లిష్ట అనుభూతుల సమన్వయంతో ఆయన ఆలపిస్తాడు.

'ఒంటరితనం మనకు మనం విధించుకున్న దురదృష్టం
ఆత్మ విమర్శ ఆచ్ఛాదనల్ని తొలగించి అందమైన లోకాన్ని
మనముందు ప్రత్యక్షం చేస్తుంది
ఈ దేశం మట్టిలో కవులు చల్లిన సౌందర్యరాసుల్ని ఆత్రంగా ఏరుకుందాం రండి!'

సుమనశ్రీ ఒక ఇటాలియన్ ఒపేరా గాయకుడిలాంటి కవి. తన పరవశ ఆనందంలో వివిధ భావాల్ని వెదజల్లుతూ కవితని ఆలపిస్తాడు.

ప్రకృతి పరివర్తనానికి భావోద్వేగాల్ని అల్లి ప్రదర్శిస్తాడు.

'నీళ్ళలో గడ్డకట్టిన మంచులో నలుపు తెలుపులు కల్సిపోతూ కరిగిపోతూ కనపడ్డా
అదృశ్యంగా అరగని ఈర్ష్యాసూయలు ఆకాశాన్నించి వేలాడుతూనే వున్నాయి
నిశ్శబ్దాన్ని కౌగలించుకోమని వేధిస్తున్నాయి'

ఒక ఆశ్చర్యాన్ని, ఒక దిగ్భ్రమని, ఒక వింత అనుభూతిని కలిగించే కవిత్వం సుమనశ్రీది. ఒక పూల కుండీలో రెండు నక్షత్ర కిరణాల్ని, రెండు నవ్వుల్ని, రెండు మల్లెపూలని, రెండు కన్నీటి మణుల్ని పెట్టినట్లుంటుంది సుమనశ్రీ కవిత్వం.

సౌందర్య నేత్రం

మన ప్రాచీనులు 'శరీర మాద్యంహిఖలు ధర్మసాధనమ్' అన్నారు. అన్నిటికీ శరీరమే కారణం. అది భౌతిక ఆనందానికే కాదు, ఆధ్యాత్మిక ఆనందానికీ కేంద్రమే. సౌందర్యాన్ని అపూర్వంగా సుమనశ్రీ ఆవిష్కరిస్తారు.

శరీరం గురించి చెబుతూ ఆయన

'స్త్రీకైనా, పురుషుడికైనా

శరీరం ఒక జ్వాలావలయిత అగ్నివృక్షం

దాన్ని నేను ప్రేమిస్తాను, కామిస్తాను, కీర్తిస్తాను' అని ప్రకటించారు.

ఆ క్రమంలో అద్భుత శారీరక ఆనందపు అంచుల్ని ఆవిష్కరిస్తూ పోతాడు.

'నీ చేతుల మధ్య నన్ను

మృదువుగా చెక్కుతున్నప్పుడే నేను శిల్పాన్నయింది

నువ్వు సున్నితంగా స్పృశించినప్పుడే

నా కనుబొమల మధ్య దీపమొచ్చి చేరింది.'

ఒక శరీరం యింకొక శరీరాన్ని తాకినప్పుడు, స్పర్శించినప్పుడు, కౌగలించినప్పుడు కలిగే రసాయనిక చర్యను వర్ణభరితంగా భావోద్వేగంతో వర్ణిస్తాడు. తను ఆ చేతుల మధ్య శిల్పంగా రూపొందడాన్ని తన కనుబొమల మధ్య దీపం వెలగడాన్ని ప్రదర్శించి మనల్ని కాంతిలో నింపుతాడు.

'స్వరాల మధ్య స్వర్గద్వారాలు తెరుచుకుంటాయి

ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య మంద్ర స్వరంలో

వేణుగానం నన్నుక్కిరి బిక్కిరి చేస్తోంది

...డిమ్ లైట్లో డప్పుల మోతలో ఒక మృగ సంస్కారం

తన అందాల్ని ఆవిష్కరిస్తున్నట్లు

ఏదో తెలీని ఉత్సాహపూరిత శృంగారం

నా కనుబొమల మీద కసరత్తు చేస్తోంది.

ఇక్కడ ఒక తన్మయ తాంత్రికుడు కనిపిస్తాడు. స్పర్శలోని ఆనందాన్ని, కదలికలోని మెరుపుల్ని ఉత్సాహాన్ని ప్రదర్శిస్తాడు. ఆ వాతావరణం, అంగాల సంచలనం, వేణుగానం, డప్పులమోత వీటన్నిటి సమన్వయంలో ఒక 'మృగ సంస్కారం' ధ్వనిస్తుంది.

సౌందర్యమంటే శారీరక సౌందర్యమే కాదు, కట్టలు తెంచుకున్న కాంక్ష మాత్రమే కాదు.

'సంపంగె పూలకోసం చేతులు సాచింది నా ప్రేయసి

ఒక్క గంతులో కొమ్మనందుకుని ఒక గుప్పెడు పువ్వుల్ని

ఆమె ఒడిలో గుమ్మరించాను'

మనోహరమయిన దృశ్యాన్ని మనమందుంచాడు. అందం, ఆనందం కలగలసిన ఆ అపూర్వ దృశ్యం మనల్ని ఆకర్షిస్తుంది. ఎందుకో ఆమె దిగాలుగా వుంటుంది. ఆమెను ఓదార్చే పనిలో పడతాడు.

'ఎప్పుడూ నువ్వెందుకలా ముడుచుకునిపోతావు ఏదో కోల్పోయిందాన్లా

రా ఇలా వచ్చి కూచో నా ముందు ఒక అప్సరసలా, అని పిలుస్తాడు. ఓదారుస్తాడు. ఇంకా 'ఆకాశంలోంచి క్రిందకు చూడ్డం నేర్చుకో

నీకు పగలూ రాత్రీ అందంగానే కనిపిస్తాయి

దేని అందం దానిదే, దేని విశాలత్వం విశృంఖలత్వం దానిదే' అంటాడు. తన సౌందర్య దర్శనాన్ని, తన తాత్విక దృష్టిని ఆమె ముందుంచుతాడు. భావుకుడయినా, భావోద్వేగం వున్నవాడయినా సందర్భాన్నిబట్టి ఈ సౌందర్యారాధకుడిలో తత్వచింతన కూడా తలవూపుతుంది.

ఒక కలయికని భూమ్యాకాశాల మధ్య వ్యాపించిన పరిమళంలా ప్రసరింప జేస్తాడు. మనం దిగ్భ్రమతో అతని మాటల వెంట మనసును వదిలి పెడతాం.

గుహలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల మధ్య
తీగలు తీగలుగా సాగిన అనురాగం
ఊడల మర్రిలా బలంగా భూమిలోకి దిగుతుంది
రాళ్ళలోంచీ మట్టిలోంచీ
భూమి నలుమూలలకీ వేనవేన యేళ్ళుగా పాకుతుంది
ఒక గంగా ప్రవాహమై పట్టణ వీధుల్లో
ప్రేమని పంచుతూ పారుతూ వుంటుంది.

కలయిక యిద్దరు వ్యక్తులకే పరిమితమయింది కాదు, అది పరిసరాల్ని వెలగిస్తుంది. ప్రపంచానికి పరిమళాన్ని పంచుతుంది. ప్రకృతిని పరవశింపజేస్తుంది.

ఆమె కనిపిస్తే చాలు అతను అన్నీ మరచిపోతాడు
'నీ జులపాల జరీచీరల మధ్య నించి
రెండు నక్షత్రాలు మెరుస్తూ నిల్చున్నాయి
చిరుదీపాల కాంతి ప్రవాహంలో నన్ను నేను
కోల్పోయిన ఉన్మాదంలో...
రాలిపోతున్న ఆకుల మధ్య నువ్వు కప్పుకున్న రహస్య వస్త్రం
గాలికెరిగిపోతూ నాకొక కొత్త ఉదయాన్ని ప్రమాణం చేస్తోంది
గాలి కెరటాల ప్రాచీన సంధ్యలో నిన్ను గాఢంగా హత్తుకున్న
క్షణాల స్మృతి నాలో మెలికలు తిరుగుతోంది.

ఒక ప్రాణవంతమైన దృశ్యం, అనురాగం పొంగుతున్న దృశ్యం మనల్ని దిగ్భ్రమకి లోను చేస్తుంది. సర్వలలితకళల సమ్మేళనంలాంటి సౌందర్య ఛాయలో సుమనశ్రీ మనల్ని సేదదీరుస్తాడు.

విహ్వల నేత్రం

నేత్రం ముందు అన్నీ మనోహర దృశ్యాలేకాదు. బాధామయ దృశ్యాలూ ఎదురవుతాయి. అవి ప్రపంచం నించీ కళ్ళలో పడినవి కావచ్చు. మనసులోతుల నించీ కళ్ళవేపు సాగినవీ కావచ్చు.

తన గురించి తను విహ్వల నేత్రంలోకి మనం అడుగుపెట్టేముందు సుమనశ్రీ చెప్పుకున్నాడు.

'ఏదీ దాచుకోకుండా నిజాన్ని నాకంటే
నిర్భయంగా ఎవరు చెప్పగలరు?
మనిషి అంతరంగ రహస్యాల్ని నాకంటే గొప్పగా
ఎవరు వెలికి తీయగలరు?
కవిత్వమంటే మనిషితో మనిషి చేసే
ఆత్మీయ సంభాషణే అని నా నమ్మకం'

తను నిర్భయంగా నిజాల్ని చెబుతానని, అంతరంగ రహస్యాల్ని విప్పుతానని కవిత్వం అంటే అది ఆత్మీయ సంభాషణ అని అంటున్నాడు. అంతా మనోహరమని ఆశించి ఫలితాలు వేరుగా వుంటే కవి పరితపిస్తాడు.

'ఇన్నాళ్ళూ మానవత్వం లాంటి వెన్నెల కోసమే నిరీక్షించాను
నేలమీది జీవితం నిప్పుల్ని విరజిమ్ముతోంది
అంతటా కంకాళాలు మండుతూనే వున్నా
పొగచూరిన గుడిసెల్ని కూడా రాజకీయం పీడిస్తూనే వుంది

కులం బూడిదలో కూడా రాజకీయం బంగారం ఏరుకోవాలని ప్రయత్నిస్తోంది, దృశ్యం మారిపోయింది. చల్లగాలి అదృశ్యమైంది. ఆర్ద్రత నిండిన ఆలింగనం మాయమైంది. పరిమళాన్ని చల్లే పూలు రాలిపోయాయి. నిర్మలత్వం నిండిన దృశ్యాలని చూసే నేత్రం క్రూరమైన, ఘోరమైన వాతావరణాన్ని చూస్తోంది. రాక్షస రాజకీయాన్ని చూస్తోంది. యిష్టాయిష్టాలకు సంబంధంలేని కవిదర్శన యిక్కడుంది. దాన్ని తప్పించుకోవాలని కవి అనుకోడు.

ప్రపంచమే కాదు కొన్నిసార్లు అంతరంగం కూడా బాధపెడుతుంది.

'నేనొక అర్థం కాని అడవిని.
చీకటి చెట్లతో ఆటలాడుకునే అర్ధరాత్రిని
అనంతాకాశంలోని ఆకలి క్షేత్రాలన్నింటినీ
ఆక్రమించుకోవాలని ఆత్రుత పడుతున్న అజ్ఞాన నేత్రాన్ని'

ఒకోసారి మనసులో బాధ మెదుల్తుంది. అది సకారణంగానే ఆరంభమవుతుంది. దానికి కారణాలుంటాయి. కానీ అవి అర్థంకావు. మనసంతా అంధకారంతో నిండుతుంది. దిక్కుతోచనితనం దిగంతాలు వ్యాపిస్తుంది. బయటపడాలని ఎంత గింజుకున్నా బాధపడక తప్పదు. అంతా ఒక్కోసారి అయోమయం నిండిపోతుంది. దారీ తెన్నూ తెలీదు.

'గాఢ పరిచయ జ్ఞానాలు
భౌతిక భ్రమావరణాన్ని విస్తృతిచేసి విపులీకరిస్తున్నాయి
వెన్నెల కనుమరుగయింది. నక్షత్రాలు మసిబారిపోయాయి
సర్వగ్రహాలు విగ్రహాలై నిశ్చేష్టత ననుభవిస్తున్నాయి'

అంతరంగం నించీ సాగిన అంధకారం అనంత ప్రకృతినీ ఆక్రమిస్తుంది. సున్నిత హృదయం గాయపడితే అనుభూతుల్ని చీకటి కమ్ముతుంది. విషాదం వ్యాపిస్తుంది. విహ్వలత్వం నాలుకలు చేస్తుంది. తన దురంత విషాదాల్ని కూడా కవి అద్భుతంగా భయదభీకరంగా ఆవిష్కరిస్తాడు.

అప్పుడు అంతా అలికేసినట్లుంటుంది
'ఎదురుగ్గానే ఉంటాం కానీ ఏ ముఖాన్నీ సరిగ్గా చూళ్ళేకపోతాం
అన్నీ అద్దంలో బొమ్మల్లా నీళ్ళలో ప్రతిబింబాల్లా
పగిలిపోయిన కొబ్బరి బోండాల్లా
మనోఫలకం మీద అసంపూర్ణ చిత్రాల్లా
సగంలో విరిగిపోయిన చంద్రవంక ఫలకాల్లా' వుంటాయి.

భూకంపాలు, సునామీలు, అగ్ని పర్వత విస్ఫోటనాలూ అంతరంగంలో కూడా జరుగుతాయి. ఎక్కడివక్కడ పద్ధతిగా పేర్చుకున్న అనుభూతులన్నీ అల్లకల్లోలమవుతాయి. కలగాపులగమవుతాయి. ప్రాణవంతమయిన ప్రతిదీ నిర్జీవంగా కనిపిస్తుంది. ఏదీ అంచనా కందదు. అస్తవ్యస్త స్థితిలో దారీ తెన్నూలేని వరద వుధృతిలో మనసు కొట్టుకుపోతుంది.

తన విహ్వల స్థితిని సుమనశ్రీ విలక్షణంగా ఆవిష్కరిస్తారు.

'విచిత్ర సంకేతాల జల ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాణ్ణి
కాగితప్పడవలో ఖండాంతర యానాలు చేస్తున్న వాణ్ణి
చిల్లి గవ్వక్కూడా కొరగాని అస్పష్ట మనోహర కవితల్ని చిత్రిక పడుతున్న వాణ్ణి
నా ఒంటరితనం నా చుట్టూ నేనల్లుకున్న వల
అస్తినాస్తి విచికిత్సలో ఉజ్వల నేత్రాల మధ్య ఊగిసలాడుతున్న వాణ్ణి
ఒక ఒక్క స్నేహితుని జాబు కోసం యుగయుగాలుగా నిరీక్షిస్తున్నవాణ్ణి'

తన నిస్సహాయతని, తరంగితం చేస్తున్న తపనని, విహ్వల విషాదంలో కూడా మనోహర కవితల్ని చిత్రికలు పట్టే తన స్థితిని, తనని అల్లుకున్న ఒంటరితనపు వలని, తన మిత్రుని ఉత్తరం కోసం తపిస్తున్న తన తత్వాన్ని విహ్వలంగా కవి వివరిస్తాడు.

రహస్య నేత్రం

కవిత్వం ఎక్కడ నించి ఎప్పుడు ఎలా మొదలవుతుందో ఎవడూ చెప్పలేడు. అది అజ్ఞాతం నించే ఆరంభమవుతుంది. ఆ మాధుర్య రహస్యం అనవగతంగానే మిగిలి పోతుంది. అది శాస్త్రీయ విశ్లేషణలకు అందదు. అది మనల్ని ఆశ్చర్యపరుస్తూనే వుంటుంది. దాన్ని గురించి చెబుతూ సుమనశ్రీ

'ఏ కవీ కవిత్వాన్ని ఉత్తగాల్లోంచో
ఆకాశంలోంచో సృష్టించలేడు
అనాది కాలం నించీ మనిషి రక్తమాంసాల్లోనో
ఆలోచనల్లోనో ఊపిరిలోనో ఎక్కడో
దాక్కొని ఉంటుంది కవిత్వం
ఆ రహస్యాన్ని ఛేదిస్తాడు కవి – అంతే" అంటాడు.

కవిత్వాన్ని తాను సమస్తంగా భావిస్తాడు. అనురాగమూర్తి ఐన

అమ్మగా వూహిస్తాడు. అమ్మను ఎవరూ ఎప్పుడూ మరచిపోరు. ఆకాశంలో ఆమె, మన రక్తమాంసాల్లో ఆమే. మన ఆలోచనల్లో ఊపిరిలో ఆమె రహస్యంగా వుంటుంది.

'మా అమ్మ నాకెప్పుడూ వంటింట్లో కోరికల పెద్ద పీట వేస్తూండేది
అమ్మకి దూరమైన ప్రస్తుతం
తీరని కోరికల్ని తీర్చుకోడానికి సాక్షాత్కరించింది
కవిత్వమే నాకొక కామధేనువై'

కవిత్వం తనకొక వరం, అదృష్టం. తన సమస్తమయిన కాంక్షల కేంద్రం. అది అమ్మ లాంటిది. అడిగిన వరాలిస్తుంది. జీవితంలో అంతకన్నా అందుకోదగిందేదీ సుమనశ్రీకి కనిపించదు. తన కోరికలన్నీ అక్కడ సంతృప్తిపడతాయి. ఈ రహస్యాన్ని తను అందుకున్నందుకు జన్మ సాఫల్యమయినట్లు ఆయన పొంగిపోతాడు.

వాక్యం కవిత్వమవుతున్న క్షణం అదొక అద్భుత ఘడియ. ఎందరో కవిత్వాన్ని కాదని వెళ్ళిపోయిన వాళ్ళు మళ్ళీ కవిత్వం నీడకు చేరడం ఆయన చూశాడు. కవిత్వం కోసం తపించే వాళ్ళని చూశాడు.

'ఎక్కణ్ణించో ఎక్కడికో పోయి చివరికి
కవిత్వం దగ్గరికే వచ్చి చేరే దీపం పురుగుల్ని ఎందర్నో చూశాను
గ్లాసుకి గ్లాసు తాటించి కేరింతల్లోనో కట్ కాఫీ సేవిస్తూ
పగలబడి నవ్వుతూనో అక్షరాల్ని పొందిగ్గా
పొట్లాం మడతల్లోంచి జారిపోకుండా కాపాడుకుంటూనో'

గాల్లోంచి ఎగొరొచ్చే మాటకోసం చాతకపక్షుల్లా నిరీక్షించే వాళ్ళు ఆయనకు తెలుసు. కవులతో, కవుల సమావేశాలతో పరిచయమున్న వాళ్ళకు యివన్నీ అనుభవంలో వుంటాయి. వాళ్ళకు కవిత్వమే ప్రాణం. కవిత్వమే జీవితం. మాటకోసం వాళ్ళు అల్లాడుతారు. అట్లాంటి వ్యక్తులతో దశాబ్దాల సాహచర్యం సుమనశ్రీకి వుంది. వాళ్ళూ తనలాంటివాళ్ళే. రహస్యాన్వేషణలో తనలాగే రాత్రింబవళ్ళు వాళ్ళు తపించారు.

కవిత్వం రహస్యం దానికోసం నిరీక్షిస్తాడు.

'రాత్రంతా అక్షరాల వాన కురుస్తూనే ఉంది
ఏరుకుంటూనే వున్నా
అక్షరం అక్షరం ఒక మంత్ర ముగ్ధ శరీరాల

అధివాస్తవిక నినాదాల రుద్రవీణా తరంగం
ఒక ఏకాంత మందిర ముఖ ద్వారం
రంగురంగుల ప్రాకారాల శిల్పతోరణం'

పదం ముందు నిల్చుంటాడు. అక్షరం కోసం తపస్సు చేస్తాడు. అది రహస్యంగా రాత్రి పూట వస్తుంది. అక్షరాల వాన కురుస్తుంది. అక్షరమక్షరంలో ముగ్ధ శరీరాల్ని, అధి వాస్తవిక రుద్రవీణా తరంగాల్ని చూస్తాడు. అక్షరంలో ఏకాంతమందిర ముఖద్వారాన్ని, రంగురంగుల ప్రాకారాల శిల్పతోరణాల్ని దర్శిస్తాడు, పులకిస్తాడు, తపిస్తాడు.

తనెలాంటివాడో, తనని ఎలా అర్థం చేసుకోవాలో చెబుతాడు. మామూలు మనిషిలా తనని సమీపిస్తే తను అర్థం కానంటాడు.

'దొరకను గాక దొరకను మీకు
నా పద విన్యాసంలో తప్ప, నా రహస్యాక్షరాల్లో తప్ప
దొరకను గాక దొరకను'

ఆయన శైలే ఆయన జీవితం, ఆయన పదాలే ఆయన ప్రాణం. మనం వాటిల్లోకి వెళ్ళాలి. వాటినిబట్టి ఆయన్ని అర్థంచేసుకోవాలి. అన్యథా ఆయన అర్థంకాడు.

దిలాన్ థామస్‌లా సంక్లిష్ట పదచిత్రాల సమాహారాల్ని ఆయన ఆవిష్కరిస్తాడు.

'రాత్రంతా దిలాన్ థామస్‌తో ముచ్చటిస్తూ గడిపాను
పార్కులో, గ్లాసుకీ గ్లాసుకీ మధ్య
పక పకా నవ్వుతూ మాట్లాడుతూంటే
...దిలాన్ వినిపించే గీతాలేవీ నాకర్థం కాకపోయినా
నా చెవుల్లో మాత్రం అని శ్రావ్యంగానే మ్రోగాయి'

పదచిత్రాల పరిమళ రహస్యం తెలిసినవాడు సుమనశ్రీ. రాత్రిళ్ళు దిలాన్ థామస్ కవిత్వాన్ని రహస్యంగా చదివి రహస్యంగా మిగిలిపోవడం తెలిసిన కళాశీలి ఆయన.

అద్భుత నేత్రం

అద్భుతాల్ని ఆమోదించడంలో ఆనందముంది. అద్భుతాలకు ఎదురు చూడడంలో ఆనందముంది. సృష్టి అద్భుతం. జీవితం అద్భుతం. అద్భుతంపట్ల మనం ఆశ్చర్యం ప్రకటించాలి. అద్భుతానికి మనం అవనతం కావాలి. అందుకే సుమనశ్రీ –

'శరీరపు ఆకర్షణ, కోరిక ఎంత నిజమో
అనారోగ్యమూ, మృత్యువూ అంతే నిజం
మన కళ్ళముందు కనబడే శిథిల వృక్షం ఎంత నిజమో
యోగ నిద్రలో మనల్ని కౌగిలించుకునే
అద్భుత స్వప్నమే అంతే నిజం' అంటారు.

అందుకనే ఆయనలో అనంతమయిన ప్రశ్నలు మెదుల్తాయి. సృష్టి స్థితిలయాల కతీత మైంది ఏది? ఈ అనంత సృష్టి చలనం

వెనకవున్నదేమిటి? అనంత విశ్వం ముందు అల్పమయిన మన జీవితమెంత? కానీ అద్భుతమయిన స్పందన ఏదో మన అంతరంగంలో మెదుల్తూ వుంటుంది. ప్రకృతి మన అహాన్ని చూసి పరిహసిస్తూనే వుంటుంది. ఈ అస్తవ్యస్త పరిస్థితుల వెనకవున్న అద్భుత మేమిటి?

'నా కలల్ని భగ్నంచేస్తూ సూర్యగోళాల్ని కల్లోలపరుస్తున్నదెవరో
కళ్ళముందున్న ప్రపంచమంతా సత్యాన్ని అపహాస్యం చేస్తున్నప్పుడు
పువ్వు పువ్వూ నా అస్తిత్వాన్ని ప్రశ్నిస్తోంది
రేణువు రేణువూ నా ఉనికిని వెక్కిరిస్తోంది'

మనిషి కొన్ని స్థితుల్లో సంక్షోభానికి లోనవుతాడు. మనిషి వునికే ప్రశ్నార్థకమవుతుంది. విలువలు తలకిందులవుతావు. ఆ మధ్య ఇండోనేషియాలో జరిగిన సునామీ, ఇటీవల జపాన్‌లో సంభవించిన సునామీ దృశ్యాల్ని చూస్తే మన జీవితానికి ఏమయినా అర్థముందా? అనిపించదు!

ఎంత నిస్సహాయతవున్నా అక్షరమే తనకు ఆధారం, ఆనందం, రహస్యమంటాడు కవి.

'నా జీవితం అక్షరం చుట్టూ చుట్టుకుంటున్న
ఒక అత్యద్భుత మహాసర్పం అవుతున్నప్పుడు
ఎలాంటి మృత్యువు నన్ను కౌగిలించుకున్నా
నాకేపాటి దుఃఖమూ అంటదు'

అక్షరాలంటే ఆయనకంత అనురాగం. ప్రేమ. ఆయన విషాదాలన్నిటికీ అక్కడే ఓదార్పు దొరుకుతుంది. అక్షరాలు ఆయన రక్షణ వలయాలు. ఎందుకంటే ప్రతి అక్షరం ఆయన ముందు శిల్పంలా ప్రత్యక్షమవుతుంది. నిర్బంధాలు సడలిపోతాయి. ఆటంకాల కంటకాలన్నీ అదృశ్యమయిపోయి అక్షరమొకటే దరహాసంతో నిల్చుంటుంది. అభయమిస్తుంది. ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. సుమనశ్రీ పరవశంతో అక్షరాన్ని ఆలింగనం చేసుకుంటుంది. అక్షరమే అద్భుతం! ఆ అద్భుతం సుమనశ్రీకి అండగా వుంది. యింకేం కావాలి? అతని ప్రయాణంలో ఒక తన్మయముంది.

'పువ్వునీ పువ్వునీ ఆఘ్రాణిస్తూ
పుస్తకాల మధ్య సమస్త విశ్వాన్నీ విస్మరిస్తున్నాను

ఊహకీ ఊహకీ మధ్య మంచు గుహల
మార్మిక లోకాల్లోకి జారిపోతున్నాను
అంతర్నేత్రాలతో అంతరాంతర రహస్య క్షేత్రాలను ముట్టడిస్తున్నాను.'

పై వాక్యాలు చూడండి. వాటిల్లా ఏదో గంధర్వగానముంది. మాటలకందని మహా సంస్కారముంది. తనకు సంబంధించిన ఒక సౌందర్య ప్రపంచాన్ని నిర్మించుకున్న స్వాప్నికుడి ప్రవచనాల్లో వున్నాయి ఈ వాక్యాలు. అదొక మార్మిక కేంద్రం. అక్కడి నించి ఒక సున్నితత్వాన్ని, మార్దవాన్ని ప్రసరించే కళాశీలి సుమనశ్రీ. అది సున్నిత ప్రపంచమయినా బలమైన ప్రపంచం. ఆ ప్రపంచాన్ని ప్రేమతో పరిపాలించే సౌందర్య చక్రవర్తి సుమనశ్రీ. ఈ వాక్యాల్లో జనన మరణాతీతమయిన జాజిపూల పరిమళ సంభాషణ ఏదో రహస్యంగా దాగి వుంది.

జీవితాన్ని పరిశీలించి, ప్రయాణించి అక్షరాల అమృత ఉద్యానవనం మధ్య తన శాశ్వత నివాసాన్ని నిర్మించుకున్న ధన్యజీవి సుమనశ్రీ.

సమకాలీన ప్రపంచ కవులు - సుమనశ్రీ సామరస్యం

ప్రపంచ సాహిత్యాన్ని ప్రత్యేకించి సమకాలీన ప్రపంచ కవిత్వ పరిణామాల్ని ఎప్పటికప్పుడు నిశితంగా సుమనశ్రీ పరిశీలిస్తాడు. వస్తు నిర్వహణని, రూప పరిణామాల్ని అనుశీలిస్తూ, తన అభిప్రాయాల్ని, తన కవితా నిర్మాణ విధానాల్ని, ఎప్పటి కప్పుడు సరిచేసుకుంటూ సాగుతాడు.

కవిత్వం గురించి ఆయన అభిప్రాయాలు సమాకాలీన ప్రపంచ కవుల అభిప్రాయాలతో సరితూగుతాయి. వాళ్ళతో ఆయన అభిప్రాయాలు సమన్వయిస్తాయి.

పాల్ సిలాన్ రుమేనియా కవి. సర్రియలిజంతో, మార్మికవాదంతో ప్రభావితుడు. ఆయన కవిత చూడండి.

నేనే మొదటి వాణ్ణి
దాని కంటి కోసం ఎదురుచూస్తున్న నీలాన్ని మొదట తాగాలనుకున్న వాణ్ణి నేనే
నీ పాదముద్ర నించీ తాగి చూస్తాను, నువ్వు నా వేలి గుండా తిరుగుతావు
ముత్యమై పెరుగుతావు, అన్నీ మరచిపోతావు, నువ్వు తిరుగుతావు
గుడ్ బై చెప్పే తెల్లటి కర్చీఫ్‌వు, నల్లటి నమస్కారాన్ని విషాదం పట్టేస్తుంది.

పాల్ సిలాన్‌ని సర్రిలిజయం ఎంత ప్రభావితం చేసిందో తెలుస్తుంది. సుమనశ్రీ సర్రియలిజంతో ప్రభావితుడు. విలక్షణమైన వ్యక్తీకరణకు దాన్ని ఉపయోగించుకున్నవాడు. వాక్య విన్యాసంలో, వ్యక్తీకరణ వైవిధ్యంలో పాల్‌సిలాన్‌కు సుమనశ్రీకి పోలికలు కనిపిస్తాయి.

ఒడిస్సియస్ ఎలిటిస్ ఆధునిక గ్రీకు కవి. కవిత్వం గురించి ఆయన మాటలు

'చూడండి ప్రకృతికి, భాషకు మధ్య నేను వూహల వుయ్యాల లూగుతాను. ఆ నిరంతర గమనింతో ఆనందిస్తాను. నా వ్యాపకం అదే. ఆ విషయంలో నేను సర్రియలిస్టులకు రుణపడి వున్నాను. ప్రతిదీ వూహల మీద ఆధారపడిందే' అంటాడు.

అంతే వూహల్లో కదుల్తూ సుమనశ్రీ 'నువ్వూ, నేనూ, మన ప్రతిబింబాలూ ఆ ప్రతిబింబాల ప్రతిబింబాలూ అన్నీ ప్రకృతి స్వప్నఫలాలే. ఒక్కో జీవితం ఒక్కో మహా స్వప్నం' అంటూ ప్రకృతికీ భాషకూ మధ్య ఎలిటిస్‌లాగా వూహల వుయ్యాల లూగుతాడు.

ఎలిటిస్ గురించి లారెన్స్ డ్యూరెల్ అన్న సాహిత్యకారుడు 'అతను సాహిత్య, సాంకేతిక రంగంలో వస్తున్న అత్యాధునిక ధోరణుల్ని ఎప్పటికప్పుడు ఆవిష్కరిస్తాడు. అదే సమయంలో సంక్లిష్టతని కాక సారళ్యాన్ని యిష్టపడతాడు' అన్న మాటలు నూటికి నూరు శాతం సుమనశ్రీకి వర్తిస్తాయి.

లెబనాన్ కవి అడోనిస్ సుమనశ్రీ కన్న పదేళ్ళు పెద్దవాడు. 'ఎక్కడ కవిత్వం ఒక వృక్షమై వుంటుందో ఎక్కడ మనుషులు ఆ వృక్షాన్ని దర్శిస్తారో, ఎక్కడ కవి దాని సంరక్షకుడో ఆ కవి ప్రపంచ జీవన స్పందనల్ని అర్థం చేసుకున్నవాడు' అన్నాడు.

లిథోనిస్ కవిత చూడండి –

దారి

నేను మంచు జీవితాన్ని, మంట జీవితాన్ని పంచుకోవాలనుకుంటాను
కానీ మంచుగానీ, మంటగానీ తమలోకి నన్ను తీసుకోవు
కాబట్టి నా ప్రశాంతతని నేను నిలుపుకున్నాను

పూలలాగా ఎదురు చూశాను, రాళ్ళలాగా నిరీక్షించాను
నేను కలగన్న జీవితానికి నేను జీవిస్తున్న కలకు మధ్య అలలా కదుల్తూ
వొరిగిపోయాను, పరిశీలిస్తూ కరిగిపోయాను.

ఏదయినా సున్నితంగా వివరించడం, సుకుమారంగా వ్యక్తీకరించడం సుమనశ్రీ పద్ధతి. ఆధునిక సంక్షోభంలో లిథోనిస్ కానివ్వండి, సుమనశ్రీ కానివ్వండి. పువ్వులాంటి కవులు చిన్ని బాధకు కూడా స్పందిస్తారు. సుమనశ్రీ వాక్యాలు చూడండి.

గాలినిండా ఏదో తెలీని స్వప్న పరిమళం
గళం నిండా ఎక్కడిదో అమృతపు చుక్కల జలపాతం
స్వప్న దగ్ధమై కాంక్షాతప్తమై
కళ్ళు రెండూ అలా తెరుచుకునే ఉన్నాయి
ఆ నీడ నన్ను గాఢంగా కౌగిలించుకోవాలని
అలా నిరీక్షిస్తూనే వుంది నా ఇంటిముందు'.

పై రెండు కవితల్లో కలలు, పూలరేకులా కదిలిపోవడాలు, ఒక సౌకుమార్యం, అమూర్తాల్ని పట్టుకునే ఆరాటం, నిస్సహాయత, ఆనందం రెండూ కలసిన ఆకర్షణ, పిల్ల కాలువలాంటి నిర్మల వాక్య విన్యాసం కనిపిస్తుంది.

ఆధునిక చేతన వున్న సుమనశ్రీతో సన్నిహితంగా స్పందించే ప్రపంచ కవులు ఎందరో వున్నారు.

సౌభాగ్య రచనలు

కవితా సంపుటాలు

1. సంధ్యా భీభత్సం – 1984
2. కృత్యాద్యవస్థ – 1987
3. సింహావలోకనం – 1989
4. నువ్వూ–నేను – 1994
5. పునరుత్థానం – 1995
6. ప్రేమ కవితలు – 2004
7. రెండు దశాబ్దాలు – 2004
8. సౌభాగ్య కవిత – 2010

సాహిత్య విమర్శ – జీవిత చరిత్రలు

1. నేటి విమర్శ (సం) 1994
2. సమకాలీన (సం) – 1997
3. సాహిత్యవ్యాసాలు–సమీక్షలు – 1998
4. ప్రసిద్ధ ఉర్దూ కవులు – 1998
5. ఆధునిక ప్రపంచ కవులు – 1998
6. వ్యాసాలు – ద్వేషాలు – 2004
7. ఇరవయ్యో శతాబ్దం ఇంగ్లీషు కవులు – 2004
8. ఈ కాలం కవులు – 2006
9. వజ్రశకలాలు – 1991
10. రెండు వందల ఏళ్ళ జాన్ కీట్స్ – 1995
11. ప్రాపర్టియస్ కవిత – 1995
12. శిఖామణి కవిత్వం – తాత్విక సౌందర్యం – 2007
13. ఆశారాజు కవితా వైభవం – 2010
14. బహుత్‌ఖూబ్ యాకూబ్ – 2011

ఇతరాలు

1. దేశదేశాల ముద్దులు – 1999
2. ఆస్కార్‌వైల్డ్ ఆలోచనలు – 2004
3. గ్రీకు రోమన్ కథలు – 2004
4. జెన్ కథలు – 2004
5. తావో తరంగాలు – 2004
6. పాశ్చాత్య సంగీతకారుల జీవితాలు – 2008
7. సుప్రసిద్ధుల శృంగార జీవితాలు – 2008
8. సెక్స్ ఆచారాలు – సంప్రదాయాలు – 2008
9. అద్భుత జెన్ కథలు – 2010
10. నిత్యజీవితంలో ధ్యానం – 2010

రాబోవు రచనలు

1. కందుకూరు శ్రీరాములు కవిత్వం
2. సున్నితమైన కవి సుమనశ్రీ
3. ఖదీర్‌బాబు కమనీయ బాల్యం
4. సౌభాగ్య ప్రపంచ యాత్రా కవిత్వం
5. ఓషో రచనల అనుసృజనలు (10 గ్రంథాలు)
6. మసాల జోక్స్ (పెద్దలకు మాత్రమే)

దాతలు దొరికితే వెలుగు చూసే రచనలు

1. సమకాలీన ప్రపంచ కవులు
2. సౌభాగ్య వ్యాసాలు
3. సౌభాగ్య సమీక్షలు
4. ఖలీల్ జిబ్రాన్ కమ్మని కథలు
5. ఖలీల్ జిబ్రాన్ కొటేషన్లు
6. మార్క్‌ట్వెయిన్ కొటేషన్లు
7. రోమన్ కొటేషన్లు
8. రష్యన్ కొటేషన్లు
9. సిసిరో కొటేషన్లు
10. ప్రపంచ కవుల పరిమళాలు
11. జెన్ తత్వం
12. జెన్ కొటేషన్లు
13. ఇటలీ కవులు
14. ఫ్రెంచి కవులు
15. ఫ్రెంచి విమర్శకులు
16. దేశదేశాల సామెతలు
17. ప్రపంచ ప్రసిద్ధుల చమత్కారాలు
18. ఐన్‌స్టీన్ ఆలోచనలు
19. బెర్ట్రాండ్ రస్సెల్ ఆలోచనలు
20. గోథె కొటేషన్లు
21. ప్రపంచ ప్రసిద్ధ జోక్స్
22. అక్బర్–బీర్బల్ కథలు
23. మంచి మంచి కవితలు
24. ఈసఫ్ కథలు
25. తూర్పుదేశాల మార్మిక కథలు
26. సూఫీ కథలు
27. జెన్ గురువుల అభిభాషణలు
28. రసన (నవ్య వారపత్రిక కాలమ్)
29. వివేక కథలు

30. బౌద్ధ కథలు
31. జపాన్ కథలు
32. భారతీయ జానపద కథలు
33. జర్మన్, రష్యన్, ఫ్రెంచి, డేనిష్ ఇటాలియన్ తదితర దేశాల జానపదకథలు
34. రష్యన్ కవులు
35. స్పానిష్ కవులు
36. రింబో కవిత్వం
37. రుగ్వేదం వచన కవితానువాదం
38. తావో తత్వం
39. హూయీ నెంగ్
40. సూఫీతత్వం
41. జిడ్డు కృష్ణమూర్తి ఆలోచనలు

Sunnithamaina Kavi
Sumanasri
Sowbhagya

సుమనశ్రీ లలితమయిన కవి. శాంతివాది.
సౌందర్య ప్రేమికుడు. సంఘర్షణని
యిష్టపడడు. తనచుట్టూ వున్న ప్రకృతి
విలాసంతో పరవశించే కవి. సాధనలతో
సౌందర్యాన్ని, లాలిత్యాన్ని సమ్మేళనం చేసి
సంగీతభరితమయిన వాక్య నిర్మాణాన్ని
అలవరచుకున్నాడు. ఆయన ఏ దృశ్యాన్ని
వర్ణించినా, ఏ వస్తువును ఆవిష్కరించినా
ఒక మాధుర్యం నిండిన కవితాత్మకత
ఆయన శైలిలో కనిపిస్తుంది.



సున్నితమైన కవి

సుమనశ్రీ



సౌభాగ్య